
అడవితల్లి ఒడిలో ఉన్న ఏకిరిపల్లె గ్రామం


పాఠశాల, కళాశాలలకు కాలినడకన వెళుతున్న విద్యార్థులు


రెండెద్దుల బండిపై పంటను తరలిస్తున్న దృశ్యం

రాజంపేట మండలంలో అటవీ ప్రాంతమైన ఏకిరిపల్లె స్వాతంత్ర్యం సిద్ధించినప్పటి నుంచి నేటికీ మౌలిక వసతులకు దూరంగా ఉంది. రాజంపేటకు 20 కిలోమీటర్ల దూరంలో పులపత్తూరు గ్రామ పరిధిలో ఏకిరిపల్లె గ్రామం మజరా గ్రామంగా ఉంది. ఈ గ్రామంలో 40 కుటుంబాలున్నాయి. ఈ గ్రామానికి రోడ్డు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కాలిబాటే వారికి రాచబాటగా మారింది. విద్యార్థులు పాఠశాల, కళాశాలలకు వెళ్లాలంటే కాలినడకన వెళ్లాల్సిందే. ఏళ్ల తరబడి పాలకుల చుట్టూ తిరుగుతున్నా మా బాధలు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

కొండ కోనల్లో...


ఏకిరిపల్లె గ్రామానికి వెళ్లాల్సిన ప్రమాదకరమైన దారి ఇదే

- ఏకాంతంగా ఏకిరిపల్లె గ్రామస్థుల జీవనం
- నేటికీ రోడ్డులేక అవస్థలెన్నో...
- కాలిబాటే వారికి రాచబాట ● అటవీ అనుమతులు రాక...
- రోడ్డు వేసుకోలేక ప్రజలకు తప్పని ఇబ్బందులు

రాజంపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : పులపత్తూరుకు సమీపంలో బాహుదానది ఆనుకుని అటవీ ప్రాంతంలో ఏకిరిపల్లె గ్రామం ఉంది. వీరు అడవిలో లభించే అటవీ వస్తువులను నమ్ముకుని గతంలో జీవనం సాగించే వారు. రాను రాను అటవీ ప్రాంతంలో ఉన్న మెట్ట ప్రాంత భూములను చదును చేసుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గ్రామ పంచాయతీ బగ్గిడిపల్లె నుంచి మూడున్నర కిలోమీటర్ల మేర అటవీ ప్రాంతంలో బండిబాటే వారికి రాచబాటగా మారింది. విద్యార్థులు చదువుకోవాలంటే కాలిబాటన సుమారు 7 కిలోమీటర్ల దూరంలోని మందపల్లెకు, 20 కిలోమీటర్ల పరిధిలోని రాజంపేటకు లేదా నందలూరుకు 30 మంది విద్యార్థులు ప్రతిరోజూ కాలినడకన వెళుతున్నారు. ఈ గ్రామానికి రోడ్డు వేయడానికి ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, దివంగత మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య అనేక ప్రయత్నాలు చేశారు. మూడున్నర కిలోమీటర్ల మేర రూ.3.50 కోట్లతో రోడ్డు వేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి అనేకమార్లు ప్రతిపాదనలు పంపారు. గతంలో ఒకసారి నిధులు కూడా విడుదలయ్యాయి. అయితే రోడ్డు వేయడానికి అధికారులు సిద్ధమై అందుకు సంబంధించిన కంకర సిద్ధం చేశారు. ఇంతలో అటవీ శాఖ అధికారులు అటవీ సంరక్షణ కింద రోడ్డు వేయడానికి అనుమతులు ఇవ్వలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి అటవీ శాఖ, వన్య సంరక్షణ అధికారులు అనుమతులు ఇస్తే తప్ప రోడ్డు వేయడానికి వీలులేదని తేల్చి చెప్పారు. దీంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. కరెంటు సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకుని గ్రామంలోకి మంచినీటి పథకానికి, గ్రామ వీధి దీపాలకు, వ్యవసాయ బోరు బావులకు ఆ కరెంటును ఉపయోగిస్తున్నారు. అరటి, వేరుశనగ, వరి, రాగి, సజ్జ, పొద్దుతిరుగుడు తదితర పంటలను సాగు చేసుకుంటున్నారు. పండించిన పంటను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయాలంటే పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. గ్రామానికి వాహనాలు వచ్చే అవకాశం లేదు. అందువల్ల భూమికి సుమారు 500 ఎత్తు అటవీ మార్గంలో ఉండే ఏకిరిపల్లెకు రెండెద్దుల బండ్లను, అతి కష్టం మీద ట్రాక్టర్లను ఉపయోగించుకుని ఈ పంటలను ఎగుమతి చేస్తున్నారు. ఎత్తయిన బండరాళ్ల ప్రాంతంలో ఏమాత్రం కాలు జారినా అటు ఎద్దులకు, ఇటు ట్రాక్టర్ డ్రైవర్లు ప్రాణాలు పోగొట్టుకోవాల్సిందే. అలా గతంలో చాలా సంఘటనలు జరిగాయి. గతంలో అనేకమార్లు ఈ గ్రామాన్ని తరలించాలని ప్రయత్నించినా వారి గ్రామాన్ని వదిలి రావడానికి ఇష్టపడలేదు. గర్భిణులు, తీవ్ర అనారోగ్యానికి గురైనవారిని ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే ఎద్దుల బండికి డోలీలు కట్టి అతి కష్టం మీద వారిని అందులో పడుకోబెట్టి తీసుకువస్తుంటారు. బాహుదా నదికి నీరు వస్తే వారి కష్టాలు మరింత దుర్భరం. ఏటి ద్వారా రాలేక, ఏరును ఆనుకుని కాలిబాట ద్వారా రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. వర్షం లేనప్పుడు, బాహుదాలో నీరు తగ్గినపుడు అనేకమార్లు గ్రామ పరిధి వరకు ఏటిలో మట్టిరోడ్డును తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. వర్షపు నీటికి ఆ తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోవడం ఇప్పటికి అనేకసార్లు జరిగింది. ఇటీవల బీజేపీ నాయకుడు, ప్రస్తుత శ్రీశైలం దేవస్థానం ఛైర్మన్ పోతుగుంట రమేశ్‌నాయుడు ఆధ్వర్యంలో ఆ గ్రామాన్ని సందర్శించి గ్రామానికి రోడ్డు వేయాలని కోరుతూ సంబంధిత అధికారుల ద్వారా ప్రతిపాదనలు తయారు చేసి అధికారులకు పంపారు. అయినా అది ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి ఈ గ్రామానికి రోడ్డు వేయాలని, స్థానికులు కోరుతున్నారు.


వ్యాధిగ్రస్తులను డోలీల ద్వారా ఎలా తీసుకెళతారో తెలుపుతున్న గ్రామస్థులు


బాహుదా నదికి నీరు వచ్చినప్పుడు కొండలెక్కి మూటలు నెత్తిన పెట్టుకుని ఇలా వెళ్లాల్సిందే

నిధులు మంజూరైనా అనుమతులు ఇవ్వలేదు



గతంలో ఈ గ్రామానికి మూడున్నర కిలోమీటర్ల మేర రోడ్డు వేయడానికి రూ.3.50 కోట్ల నిధులను మంజూరు చేయించాం. పనులు ప్రారంభం చేయడానికి కావాల్సిన కంకర అన్నీ సిద్ధం చేశాం. అయితే అటవీ శాఖ అధికారులు అనుమతులు ఇవ్వకపోవడంతో పనులు నిలిచిపోయాయి. దీనివల్ల తాను వ్యక్తిగతంగా ఖర్చు చేసిన డబ్బులు కూడా వృథాగా పోయాయి. అటవీశాఖ అనుమతులు ఇస్తేగాని ఈ గ్రామానికి రోడ్డు వేయడం కష్టం.

- ప్రతాప్‌రెడ్డి, పులపత్తూరు, రాజంపేట.


ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం



ఏకిరిపల్లె గ్రామానికి రోడ్డు వేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదనలు పంపాం. నేనే స్వయంగా ఇటీవల ఏకిరిపల్లె గ్రామానికి వెళ్లి ప్రజలు అక్కడ ఎదుర్కొంటున్న బాధలను స్వయంగా తెలుసుకున్నాను. ఈ విషయంలో గత పాలకులు ఈ గ్రామానికి రోడ్డు వేసే అంశంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారు. వారు పట్టుబట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి గ్రామానికి రోడ్డు వేసి ఉంటే అన్ని సమస్యలు తీరేవి. వారి నిర్లక్ష్యం వల్ల గ్రామానికి రోడ్డు వేయలేని పరిస్థితి ఏర్పడింది. అయినా దీనిపై పోరాడి రోడ్డును వేయిస్తాం.

- పోతుగుంట రమేశ్‌నాయుడు, బీజేపీ నేత, శ్రీశైలం దేవస్థానం ఛైర్మన్

'అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలి'


అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. రాయచోటి మండలం కొత్తపేటకు చెందిన దివ్య తనకు భూమి లేనప్పటికీ తన ఆధార్ నెంబర్‌తో కొన్ని ఎల్‌పీఎం నెంబర్లు లింకై ఉన్నాయని, దీని వల్ల తనకు తల్లికి వందనం పథకాలు అందడం లేదని, తన ఆధార్ నెంబర్‌కు తనకు లేని భూములకు లింకును తొలగించాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. రాయచోటి మండలానికి చెందిన షేక్ షర్ఫుని తన భర్త చనిపోయిన తర్వాత తనకు వితంతు పింఛన్ అందడం లేదని తనకు వితంతు పింఛన్ అందేలా చూడగలరని విన్నవించుకుంది. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

పోలీసులు జవాబుదారీతనంగా ఉండాలి : ఎస్పీ


బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటిటౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసులు జవాబుదారీతనంగా ఉండాలని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు. సోమవారం పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ అర్జీలను స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడారు. ఫిర్యాదుదారుల వినతులను పరిశీలించిన ఎస్పీ సంబంధించి పోలీసు అధికారులతో ప్రత్యక్షంగా ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఎలాంటి సమస్యతో వచ్చినా వారికి న్యాయం జరిగేలా పోలీసులు ఎల్లప్పుడూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ స్పష్టం చేశారు.

యువతిపై అత్యాచారయత్నం

గుర్రంకొండ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మానసికంగా ఇబ్బంది పడుతున్న ఓ యువతిపై యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలోని ఓ గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగింది. పోలీసుల వివరాల మేరకు... మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఆమె తిరుపతిలో కూలి పనులు చేసుకుంటూ కుమార్తె, కుమారుడితో కలిసి ఉంటోంది. మరో కుమారుడు ఇక్కడే ఉంటున్నాడు. బాధిత యువతి ఆదివారం తిరుపతి నుంచి ఇక్కడ ఉన్న తమ్ముడి వద్దకు బయలుదేరింది. తరిగొండలోని రామాపురం క్రాస్ వద్ద బస్సు దిగి తమ్ముడికి ఫోన్ చేసింది. తన తమ్ముడి ఫోన్‌ను స్నేహితుడైన సయ్యద్ నయాజ్‌అలీ (27) తీసి మీ తమ్ముడు నిద్రపోతున్నాడని నేను ద్విచక్ర వాహనంలో వస్తున్నట్లు చెప్పి క్రాస్ వద్దకు వెళ్లాడు. అక్కడ నుంచి బాధితురాలిని ద్విచక్ర వాహనంలో కూర్చోబెట్టుకొని జడ్పీ హైస్కూల్ పరిసరాల్లో చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు యువకుడిని ప్రతిఘటించి తప్పించుకొని రోడ్డుపైకి రావడంతో పక్కనున్న వారు రక్షించినట్లు పోలీసులు తెలిపారు. తనపై జరిగిన దాడిని బాధితురాలు తల్లికి ఫోన్ ద్వారా తెలపడంతో తన కుమార్తెపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడిపై కేసు నమోదు చేయాలని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు.

ప్రజలు ప్రతిరోజూ స్వచ్ఛత పాటించాలి

- అందరి సహకారంతో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర సాధ్యం
- కలెక్టర్ నిశాంత్‌కుమార్
- 49 మందికి జిల్లా స్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డులు ప్రదానం


స్వచ్ఛాంధ్ర అవార్డులు అందజేస్తున్న కలెక్టర్, నాయకులు

రాయచోటి (నేతాజీ సర్కిల్), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర సాధనకు ప్రజలు ప్రతిరోజూ స్వచ్ఛత పాటించాలని నిశాంత్‌కుమార్, టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం సుధా ఈవెంట్స్ ఫంక్షన్ హాల్‌లో స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. తొలుత కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ ఛైర్మన్ నాగేశ్వర్‌నాయుడు, రాయచోటి మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాంప్రసాద్‌రెడ్డి మహాత్మా గాంధీ విగ్రహం వద్ద జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు 2వ రాష్ట్ర అవార్డులతో పాటు 49 జిల్లా అవార్డులను ప్రకటించారని తెలిపారు. ప్రజల్లో స్వచ్ఛతపై మార్పు వచ్చినప్పుడే స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర సాధ్యమవుతుందని తెలిపారు. డీపీవో రాధమ్మ మాట్లాడుతూ జిల్లాలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తడి, పొడి చెత్త సేకరణలో విశిష్ట సేవలు అందిస్తున్నట్లు కొనియాడారు. మున్సిపల్ కమిషనర్ రవి మాట్లాడుతూ రాష్ట్రంలో తాడిపత్రితో పాటు కొన్ని మున్సిపాలిటీలు రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికయ్యాయని, రాబోయే రోజుల్లో రాయచోటి మున్సిపాలిటీకి రాష్ట్ర స్థాయి అవార్డు వచ్చే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతిరోజు చెత్తసేకరణ సక్రమంగా జరిగేలా చూడాలని తెలియజేశారు. అనంతరం వివిధ విభాగాలకు చెందిన హాస్టల్స్, స్కూల్స్, అంగన్వాడీ సెంటర్లు, గ్రామ పంచాయతీలు, మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది, ఎన్జీవోస్ స్వచ్ఛంద జిల్లా స్థాయి అవార్డ్ ఎంపికైన 49 మందికి అవార్డులను అందించారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చెయ్యేటికి మళ్లీ వరద నీరు

- ధ్వంసమైన తాత్కాలిక రోడ్లు
- రాకపోకలకు తప్పని ఇబ్బందులు

4

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం


రామాంజులు, కళావతి (ఫైల్)
మృతుడు రామాంజులు, మృతురాలు కళావతి

రామసముద్రం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలం కమ్మవారిపల్లె పంచాయతీ ఎర్రబోయనిపల్లె గ్రామానికి చెందిన దంపతులు కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా శ్రీనివాసపుర తాలూకా సున్నకల్లు క్రాస్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కర్ణాటక పోలీస్‌లు తెలిపిన వివరాల మేరకు... ఎర్రబోయనపల్లె గ్రామానికి చెందిన రామాంజులు (36), కళావతి (27) దంపతులు కూలి పనుల కోసం తమ స్వగ్రామం నుంచి బెంగళూరుకు ద్విచక్రవాహనంలో బయలుదేరారు. సున్నకల్లు క్రాస్ వద్ద వేగంగా వచ్చిన టెంపో ట్రావెల్స్ వాహనం వీరి బైక్‌ను ఢీకొనడంతో దంపతులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటన రాయల్పాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకోగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

చంద్రబాబు నమ్మకాన్ని వమ్ము చేయను

- అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా ● అట్టహాసంగా పీకేఎం ఉడా ఛైర్మన్ ప్రమాణస్వీకారం


పీకేఎం ఉడా ఛైర్మన్‌గా ప్రమాణం చేస్తున్న బీఆర్ సురేష్‌బాబు

మదనపల్లె టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు తనపై ఎంతో నమ్మకం ఉంచి కేటాయించిన ఉన్నత పదవికి న్యాయం చేయడంతో పాటు సీఎం నమ్మకాన్ని వమ్ము చేయకుండా కుప్పం, పలమనేరు, మదనపల్లె అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పీకేఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బీఆర్ సురేశ్‌బాబు తెలిపారు. సోమవారం స్థానిక పీకేఎం ఉడా కార్యాలయం వద్ద ఛైర్మన్‌గా బీఆర్ సురేశ్‌బాబు ప్రమాణస్వీకారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుప్పం, చిత్తూరు, పలమనేరు, పుంగనూరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల టీడీపీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని బీఆర్ సురేశ్‌బాబును సన్మానించారు. పీకేఎం ఉడా అధికారులు సురేశ్‌బాబు చేత ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో పీకేఎం ఉడా నిధులన్నీ వారికి ఇష్టం వచ్చిన రీతిలో ఖర్చు చేశారని, ఈసారి అలా కాకుండా అన్ని నియోజకవర్గాలకు సమానంగా కేటాయిస్తూ అభివృద్ధి పనులు చేయిస్తామన్నారు. మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, పీఎస్ మునిరత్నం, టీటీడీ బోర్డు సభ్యుడు శాంతారామ్ ప్రసంగించారు. అంతకు ముందు బీఆర్ సురేశ్‌బాబును మదనపల్లె టీడీపీ నాయకులు పెరవలి నవీన్, నిరంజన్‌నాని, ఎస్.జగదీష్ గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రాటకొండ బాబు రెడ్డి, టౌన్ బ్యాంకు ఛైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, టౌన్‌బ్యాంకు వైస్ ఛైర్మన్ భాస్కర్, డైరెక్టర్లు నాదెళ్ల శివన్న, సోమశేఖర్, టీడీపీ నాయకులు సీడ్ మల్లికార్జుననాయుడు, కట్టా దొరస్వామినాయుడు, సురేంద్ర యాదవ్, ఆర్‌జే వెంకటేశ్, బీజేపీ నాయకులు ఎస్.సేతు, పెద్దసంఖ్యలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులపై కొనసాగుతున్న దాడులు

- భయంతో మూతపడ్డ బెల్ట్‌షాపులు
- బురకాయలకోటలో భారీగా పట్టుబడ్డ మద్యం



ములకలచెరువులో సీజ్ చేసిన రాక్‌స్టార్ వైన్స్


బురకాయలకోటలో పట్టుబడ్డ మద్యం బాటిళ్లు

ములకలచెరువు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు నకిలీ మద్యం తయారీ వ్యవహారంపై ఎక్సైజ్ ఉన్నతాధికారులు దాడులు కొనసాగిస్తున్నారు. ఉన్నతాధికారులు బృందాలుగా ఏర్పడి తంబళ్లపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా దాడులు కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా నకిలీ మద్యం అమ్మకాలు జరిగిన బెల్ట్‌షాపులపై ప్రత్యేక నిఘా ఉంచి దాడులు చేస్తున్నారు. అధికారుల దాడుల నేపథ్యంలో గ్రామాల్లో విచ్చలవిడిగా వెలసిన బెల్ట్‌షాపులు దాడుల భయంతో మూతపడ్డాయి. ములకలచెరువు మండలం బురకాయలకోటలో ఉన్న బెల్ట్‌షాపులో భారీగా మద్యం ఉందన్న సమాచారం రావడంతో ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. ఎక్సైజ్ అధికారులు అక్కడికి వెళ్లేసరికి దుకాణం షట్టర్ మూసి ఉండడంతో తాళాలు పగులగొట్టారు. ఈ సందర్భంగా అందులోని 278 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

హాట్‌టాపిక్‌గా మారిన రాక్‌స్టార్ వైన్స్ సీజ్

ములకలచెరువులో జరిగిన నకిలీ మద్యం తయారీ కేంద్రం వ్యవహారానికి సంబంధించి రాక్‌స్టార్ వైన్స్ సీజ్ విషయం హాట్‌టాపిక్‌గా మారింది. జయచంద్రారెడ్డి పీఏ రాజేశ్ నకిలీ మద్యం తయారీ కేసులో ఏ5గా ఉన్నారు. నకిలీ మద్యం సరఫరాకు ఉపయోగించిన లగేజీ వాహనం రాజేశ్ పేరున ఉండడం, అలాగే రాక్‌స్టార్ వైన్స్‌లో కూడా నకిలీ మద్యం అమ్మకాలు జరిగినట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. దీంతో నకిలీ మద్యం తయారీ కేంద్రానికి 100 మీటర్ల దూరంలోనే రాక్‌స్టార్ మద్యం దుకాణం ఉంది. అతి దగ్గరగా కేంద్రం ఉండడంతో రాక్‌స్టార్ వైన్స్‌లో నకిలీ మద్యం అమ్మకాలు ఎక్కువగా జరిగినట్లు వెల్లడైంది.

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు లబ్ధి

సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై కలెక్టర్ నిశాంత్‌కుమార్



వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ

రాయచోటిటౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమయ్యే వ్యవసాయ పరికరాల కొనుగోలులో జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. సోమవారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై రాయచోటి పట్టణంలోని మాసాపేటలో గల వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యవసాయ, ఉద్యానవనశాఖలు సంయుక్తగా రైతులకు, ప్రజలకు అవగాహన కోసం ఎగ్జిబిషన్‌తో పాటు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న నూతన జీఎస్టీ విధానం వల్ల రైతులకు అవసరమయ్యే ట్రాక్టర్లు, డ్రిప్పులు, స్ప్రింక్లర్లపైన ఐదు శాతం జీఎస్టీ మాత్రమే ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు బోనమల ఖాదర్‌వలి, రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు గుగ్గిళ్ళ సుబ్బయ్యనాయుడు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి శివనారాయణ, ఉద్యానవన శాఖ, వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది, పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కారు, ద్విచక్ర వాహనం ఢీ : రైతు మృతి





కారు,ద్విచక్రవాహనం ఢీకొన్న దృశ్యం, మృతి చెందిన రఘునాథరెడ్డి

కురబలకోట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-మదనపల్లె ప్రధాన జాతీయ రహదారిలోని దొమ్మన్నబావి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రైతు అక్కడిక్కడే మృతి చెందాడు. దీనికి సంబంధించి స్థానిక పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎర్రబల్లి పంచాయతీ తూగువారిపల్లెకు చెందిన రఘునాథరెడ్డి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఆయన సొంత పనుల నిమిత్తం అంగళ్లుకు తన ద్విచక్రవాహనంలో వెళుతుండగా దొమ్మన్నబావి వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు.

కాగా ఈ ప్రమాదంలో మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారు. సంఘటనా స్థలానికి ముదివేడు ఎస్సై దిలీప్‌కుమార్ చేరుకుని విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ టీడీపీ కార్యకర్త మృతి



వెంకటేశ్వర్లు (ఫైల్)

రాయచోటి టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన టీడీపీ కార్యకర్త దేరంగుల వెంకటేశ్వర్లు (32) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు పెమ్మాడపల్లి పంచాయతీ గరుగుపల్లికి చెందిన వెంకటేశ్వర్లు శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళుతుండగా రాయచోటి పట్టణ పరిధిలోని ఇనాయత్‌ఖాన్ చెరువు వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది.

దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని బెంగళూరుకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఇతనికి భార్య, ప్రణీత్, మోక్షిత్ అనే కుమారులు ఉన్నారు. ఈయన ఐటీడీపీ కన్వీనర్‌గా కూడా పనిచేశాడు. దీంతో టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్ బాబు రాయచోటి ఏరియా ఆసుపత్రిలో మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విద్యార్థిపై దాడి కేసులో విచారణ

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడు కొట్టడంతో విద్యార్థి చూపు కోల్పోయిన సంఘటనపై సోమవారం మదనపల్లె పోలీసులు విచారణ చేశారు. వివరాలిలా ఉన్నాయి. తంబళ్లపల్లి నియోజకవర్గం బి.కొత్తకోట సమీపంలోని గట్టు గ్రామ పంచాయతీ గట్టు వద్ద ఏర్పాటైన రిషి వాటిక గురుకుల పాఠశాలలో మండలంలోని కాలాడివాండ్లపల్లెకు చెందిన శేషాద్రిరెడ్డి చదువుకునేవాడు.

గత నెలలో ఉపాధ్యాయుడు కొట్టడంతో ఆ విద్యార్థి కంటి చూపు కోల్పోయాడు. ఇందుకు సంబంధించి విద్యార్థి సొంత ఊరైన కాలాడివాండ్లపల్లె వచ్చిన పోలీసులు తల్లిదండ్రులను విచారణ చేశారు. తమకు న్యాయం చేయాలని విద్యార్థి తల్లిదండ్రులు ఈ సందర్భంగా పోలీసులను కోరారు.

అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం..

- చెక్‌డ్యాంలు కొట్టుకుపోయి ఏళ్లు
- అయినా మరమ్మతులకు నోచుకోని వైనం
- 'కూటమి'లోనైనా మరమ్మతు పనులు జరిగేనా



కుమ్మరవాని ఒడ్డు పూర్తిగా కొట్టుకుపోయిన దృశ్యం

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలోనే అత్యంత వెనుకబడిన మండలం పెద్దతిప్పసముద్రం. ఈ మండలంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన చెరువులుగా కందుకూరు వ్యాసరాయసముద్రం, పీటీఎం తిప్పరాయసముద్రం, రంగసముద్రం రంగరాయ చెరువులు ఉన్నాయి. ఎగువ ప్రాంతంలో కురిసే వర్షాలకు నీరు చెరువులకు చేరి నిండి మొరవ ప్రవహిస్తే దిగువ ప్రాంతాలకు నీరు వృథాగా వెళ్తాయి. ఈ నీటిని నిలువ చేసి ఆ నీటితో మెట్ట ప్రాంత రైతులు పంటలను పండించుకునేందుకు వీలుగా గతంలో వాగులు వంకలపై చెక్‌డ్యాం నిర్మాణాలు చేపట్టి ఆయకట్టు రైతులు పంటలను సాగు చేసుకునే వారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన 2021-22లో ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురవడంతో మండలంలోని ప్రధాన చెరువులు నిండి భారీగా నీటి ప్రవాహం రావడంతో దిగువ ప్రాంతంలో నిర్మించిన చెక్‌డ్యాంలు పూర్తిగా కొట్టుకుపోయాయి.

కొట్టుకుపోయి మూడేళ్లు..

పెద్దతిప్పసముద్రం మండలంలోని బూర్లపల్లె గ్రామం కొత్తపల్లె సమీపంలో గత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తంబళ్లపల్లె నియోజకవర్గం అప్పటి ఎమ్మెల్యే కలిచెర్ల ప్రభాకర్‌రెడ్డి చెక్ డ్యాంకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి భారీ స్థాయిలో చెక్ నిర్మించడంతో కొత్తపల్లె, శ్రీనివాసరాయునిపల్లె, మడుమూరు గ్రామాలకు చెందిన సుమారు 300 ఎకరాల ఆయకట్టు భూమికి నీళ్లు అంది పంటలను పండించుకునేవారు. కొన్ని రోజులకు పీటీఎం చెరువుకు భారీగా వరద రావడంతో కొట్టుకుపోయింది. తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వంలో తిరిగి మరమ్మతులు చేయడంతో ఈ గ్రామాల రైతులు మళ్లీ పంటలను సాగు చేశారు. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. 2021-22లో పీటీఎం మండలంలో భారీగా వర్షాలు కురవడం చెరువులు భారీగా మొరవలు పోవడంతో చెక్‌డ్యాం పూర్తిగా కొట్టుకుపోయింది. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఆయకట్టు రైతులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అతీగతీ లేదని ఆయకట్టు రైతులు వాపోతున్నారు.

చెక్‌డ్యాం వైపు కన్నెత్తిచూడని అధికారులు

పీటీఎం పెద్ద చెరువు మొరవ ద్వారా వెళ్లే మిగులు జలాలు అధిక శాతంగా నీరు వెళుతోందని ఈ నీటిని నిలువ ఉంచగలిగితే మూడు గ్రామాలకు చెందిన సుమారు 300 వందల మంది రైతులకు లాభం చేకూరుతుందని, కొత్తపల్లె, శ్రీనివాసరాయునిపల్లె, మడుమూరు గ్రామాలకు చెందిన ఆయకట్టు రైతులు తమ గోడును వెళ్లిబుచ్చుకుందామని రెవెన్యూ అధికారులను సంప్రదిస్తే ఇరిగేషన్ అధికారులను కలవాలని సలహాలు ఇస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇరిగేషన్ అధికారులకు తమ గోడును చెప్పుకుందామంటే ఇరిగేషన్ అధికారులు ఎక్కడ ఉంటారో, ఎప్పుడు వస్తారోనని రైతులు అంటున్నారు. ఈ చెక్ డ్యాం పూర్తిగా కొట్టుకు పోవడంతో నీరు వృథాగా దిగువ ప్రాంతాలకు వెళ్లి పోతుండడంతో ఈ గ్రామాల్లో నీరు అడుగంటి పోయి తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందన్నారు.

రైతుల ఎదురుచూపు

గత వైసీపీ ప్రభుత్వంలో చెక్‌డ్యాంలు, కాలువలు, వాగులు, వంకలు భారీ వర్షాలకు పూర్తిగా ధ్వంసమైనా గత పాలకులు పట్టించుకోకపోవడంతో నీరు నిల్వ లేకుండా వచ్చిన నీరు వచ్చినట్లుగా వృథాగా దిగువ ప్రాంతాలకు వెళ్లిపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి రైతులకు గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వంలో వాగులు వంకలు, చెరువులు అనే తేడా లేకుండా ఇసుకను భారీ యంత్రాలతో తోడేయడంతో భూగర్భ జలాలు అడుగంటి గ్రామాల్లో కరువుఛాయలు అలుముకున్నాయి. కనీసం కూటమి ప్రభుత్వంలోనైనా ధ్వంసమైన చెక్ డ్యాంలను పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టి ఆయకట్టు రైతులను ఆదుకుంటారని ఎదురు చూస్తున్నారు.



ఒడ్డుకు అమర్చిన రాళ్లు భారీ వర్షాలకు కొట్టుకుపోయి దిగువ ప్రాంతాలకు చేరిన దృశ్యం



ముళ్లకంపలతో పూర్తిగా ముసుకుపోయిన కుమ్మరవాని ఒడ్డు ప్రాంతం

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం..

మండలంలోని బూర్లపల్లె పంచాయతీ కొత్తపల్లె, చల్లావాండ్లపల్లె, మడుమూరు, శ్రీనివాసరాయునిపల్లె, బొంతవారిపల్లె, రంగసముద్రం, తోటవారిపల్లె తదితర గ్రామాల్లో కొట్టుకుపోయిన సుమారు 10 చెక్ డ్యాంలను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే పనులను ప్రారంభించి చెక్‌డ్యాంల మరమ్మతు పనులు చేపడతాం.

- సతీష్‌గౌడ్, ఇరిగేషన్ జేఈ

పట్టాభిరాముడికి పవిత్రాల సమర్పణ

వాల్మీకిపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిరామాలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం టీటీడీ ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ మొదలుకుని ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో విశేషాలంకరణలు చేసి పూజలు నిర్వహించారు.

ఆలయ మండపంలో ఉన్న పవిత్రాలను టీటీడీ అధికారులతో కలిసి ప్రదక్షిణగా తీసుకువెళ్లి మూలవర్లకు, భోగోత్సవమూర్తులైన సీతారామలక్ష్మణులకు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం మొదలకుని దేవతా మూర్తుల ప్రతిమలకు పవిత్రాలను సమర్పించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమాలలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ మునిబాల, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



ధ్వజస్తంభం వద్ద పవిత్రాల సమర్పణ చేస్తున్న అర్చకులు

చెయ్యేటికి మళ్లీ వరద నీరు

- ధ్వంసమైన తాత్కాలిక రోడ్లు
- రాకపోకలకు తప్పని ఇబ్బందులు

పెనగలూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎగువ ప్రాంతాల్లో శని, ఆదివారాల్లో కురిసిన భారీ వర్షాల వల్ల ఆదివారం సాయంత్రం నుంచి చెయ్యేటికి భారీగా వరదనీరు వచ్చింది. వరదనీటి ప్రవాహంతో ఓబిలి-టంగుటూరు మధ్య ఉన్న మట్టిరోడ్డు, కోడిచెన్నయ్యగారిపల్లె, పల్లంపాడు మధ్యనున్న మరో మట్టి రోడ్డు కొట్టుకుపోయాయి. రెండు వారాల కిందట పింఛా ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయడంతో ఈ రెండు రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. స్థానిక నాయకులు ట్రాక్టర్లతో మట్టి రాళ్లు తోలి మరమ్మతులు చేస్తున్నారు. అయితే అకస్మాత్తుగా ఆదివారం సాయంత్రం వరద నీరు రావడంతో రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో సోమవారం ఉదయం నుంచి నాలుగు గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించిపోయాయి.



నీటి ఉధృతికి కొట్టుకుపోయిన ఓబిలి-టంగుటూరు మట్టి రోడ్డు

డ్రోన్ సాయంతో 17మంది జూదరుల అరెస్టు

- **17 సెల్‌ఫోన్స్, రూ.4.44 లక్షల నగదు స్వాధీనం**

మదనపల్లె అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ సాయంతో 17 మంది జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 17 సెల్‌ఫోన్లు, 10 ద్విచక్రవాహనాలతో పాటు రూ.4,44,050 నగదును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ మహేంద్ర తెలిపారు. మదనపల్లె నియోజకవర్గంలోని నిమ్మనపల్లె మండలం దిగువపల్లెలో జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సోమవారం నిమ్మనపల్లె పోలీసులు డ్రోన్ సాయంతో మెరుపుదాడులు జరిపి నిమ్మనపల్లె ఎస్ఐ తిప్పేస్వామి ఏడుగురు జూదరులను, ఏడు సెల్‌ఫోన్లు, రూ.20,850 నగదును స్వాధీనం చేసుకున్నారు.

అలాగే మదనపల్లె మండలం బండకాడపల్లె సమీపంలో పేకాట స్థావరాలపై మదనపల్లె తాలుకా సీఐ కళా వెంకటరణ దాడులు చేసి పది మంది జూదరులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4,23,200 నగదు, ఐదు మోటార్‌సైకిళ్లు, 12సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకోగా మరికొంత మంది పారిపోయారన్నారు. మదనపల్లెకు చెందిన అర్జున్‌రెడ్డి, రమేశ్ పేకాట స్థావరాలు నిర్వహిస్తున్నట్లు తెలిసిందని, వారు పరారీలో ఉన్నారని, వారిపై కేసు నమోదు చేశామని, త్వరలో అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు.



మదనపల్లె మండలం బండకాడపల్లెలో జూదరులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఎర్రచందనం కేసులో ఇద్దరి అరెస్ట్



వివరాలు తెలుపుతున్న అర్బన్ సీఐ వెంకటాచలపతి

రాయచోటి టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎర్ర చందనం అక్రమ రవాణా కేసులో తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి తిరుపతిలోని ఎర్రచందనం స్పెషల్ కోర్టుకు తరలించినట్లు రాయచోటి అర్బన్ సీఐ బీవీ చలపతి తెలిపారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. 2021 అక్టోబరులో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తుండగా పోలీసులు దాడి చేయడంతో కడప జిల్లా చెన్నూరు మండలం శ్రీరాంనగర్, కొక్కరాయపల్లెకు చెందిన కొలిమి సుభాన్‌బాషా, అర్జున్ పారిపోయారన్నారు. అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్న నిందితులు ఆదివారం సాయంత్రం రాయచోటి గాలివీడు రింగురోడ్డు వద్ద వాహనాలు తనిఖీలో తాను, ఎస్ఐ బాలకృష్ణ సిబ్బందితో కలిసి అరెస్టు చేసినట్లు తెలియజేశారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేసిన అనంతరం కోర్టుకు తరలించినట్లు వివరించారు.

అంతర్రాష్ట్ర బైక్ దొంగ అరెస్టు



దొంగ అరెస్టు చూపుతున్న మదనపల్లె డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అంతరాష్ట్ర బైక్ దొంగను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర తెలిపారు. సోమవారం మదనపల్లె తాలుకా పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నిందితుడి అరెస్టు వివరాలను వెల్లడించారు. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం చంద్రమాకులపల్లెకు చెందిన పులి వెంకటరెడ్డి (33) అన్నమయ్య, బాలాజీ జిల్లా, కర్ణాటకలోని కోలారు జిల్లాల్లో 45 మోటార్ సైకిళ్లు దొంగతనం చేసి పోలీసులకు పట్టుబడ్డాడని తెలిపారు. ఇతడి వద్ద నుంచి రూ.13,50,000 విలువ చేసే వివిధ రకాల 25 బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని, ఇంకా 20 మోటార్ సైకిళ్లు ఉన్నాయని, వాటిని ట్రేసౌట్ చేస్తున్నట్లు తెలిపారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ, ఎస్ఐ చంద్రమోహన్ తమ సిబ్బంది కలిసి మదనపల్లె మండలం చుట్టుపక్కల ప్రాంతాల్లో, మండలాల్లో జరుగుతున్న మోటార్ సైకిళ్లపై నిఘా ఉంచారన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీ మదనపల్లె-పుంగనూరు రోడ్డు ఆంజనేయస్వామి ఆలయం వద్ద పులి వెంకటరెడ్డిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు.

16న జిల్లాలో మందకృష్ణ పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న డానియల్


పీలేరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 16న జరగనున్న మందకృష్ణ మాదిగ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ కోట డానియల్ పిలుపునిచ్చారు. పీలేరులోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో సోమవారం ఆయన నియోజకవర్గ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, వీహెచ్‌పీఎస్ కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరుగకుండా ఉద్యమాలు చేసిన మందకృష్ణకు జిల్లాలో ఘనంగా స్వాగత ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయన కేవలం మాదిగల రిజర్వేషన్‌ల కోసమే కాకుండా రోగులకు ఆరోగ్యశ్రీ, ప్రత్యేక ప్రతిభావంతులకు పింఛన్లు సాధించిన ఘనత కూడా ఆయనదేనన్నారు. కార్యక్రమంలో నాయకులు రవీంద్ర, గండికోట వెంకటేశ్, రామమోహన్ రెడ్డి, వెంకటేశ్, అమరనాథరెడ్డి, రెడ్డప్ప, రాము, రాజేశ్, హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

పనులు సరే...బిల్లులేవీ?

- వామ్మో మేము పనులు చేయలేము...
- చేసిన పనులకు బిల్లులు రాక..
- కాంట్రాక్టర్ల ఎదురుచూపులు

రైల్వేకోడూరు రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది ఇక కాంట్రాక్ట్ పనులను విచ్చలవిడిగా చేసేద్దాం అన్న కూటమి నేతలు ఇప్పుడు వామ్మో మేము పనులు చేయలేము అనే పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనుల కాంట్రాక్ట్ బిల్లులు చెల్లింపులకు సంబంధించిన సమస్యలు పరిష్కారమవుతాయని చాలామంది ఆశించారు. అయితే వారి ఆశలు అడియాశలయ్యాయి. ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఒకటిన్నర సంవత్సరం పూర్తవుతున్నప్పటికీ కాంట్రాక్టర్లకు చాలామందికి ఇంకా బిల్లులు అందకపోవడంతో వారు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కూటమి నేతలు పంచాయతీలకు మంజూరైన నిధులతో చిన్నపాటి సమస్యలను పరిష్కరించుకున్నప్పటికీ ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద చేసిన పనులకు సంబంధించిన నిధులు ఇంతవరకు విడుదల కాలేదు. నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు రూ.16 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టారు. అయితే ఈ పనులకు సంబంధించిన నిధులలో కేవలం 40 శాతం మాత్రమే ఇప్పటివరకు అందాయి. మిగిలిన 60 శాతం నిధులు ఎప్పుడు వస్తాయో తెలియక కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి పనులు చేపట్టిన నేతలు ఇప్పుడు వడ్డీలు కట్టుకుంటూ లబోదిబోమంటున్నారు. కోడూరు మండలంలోని ప్రధానమైన రెడ్డివారిపల్లి వంతెన పనులు దాదాపు 80 శాతం పూర్తయ్యాయి. అయినప్పటికీ ఇప్పటివరకు కనీసం ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల కాలేదు. నిధులు ఎప్పుడు వస్తాయో అర్థం కాక కూటమి నేతలు పనులు చేయడానికి భయపడుతున్నారు.

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు పనులను మొదలుపెట్టాలని ప్రయత్నించనప్పటికీ నిధులు వస్తాయో రావో అనే అయోమయంలో ప్రతినిధులు ఉన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలోపు గ్రామాలలో ప్రధానమైన రోడ్ల పనులను చేపట్టాలని లేని పక్షంలో ఎన్నికలకు వెళ్లే పరిస్థితి ఉండదని నేతలు భయపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బిల్లుల చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేయాలని స్థానిక నేతలు, కాంట్రాక్టర్లు కోరుతున్నారు.



80 శాతం పూర్తయిన రెడ్డివారిపల్లె వంతెన పనులు

ఒక్క రూపాయి రాలేదు..

- బ్రిడ్జి నిర్మిస్తున్న ఓ కాంట్రాక్టరు

బ్రిడ్జి పనులను 80 శాతం పనులను పూర్తి చేయడం కోసం ఇప్పటికే రూ.10 కోట్లు ఖర్చు చేశాను, ఇప్పటి వరకు కనీసం ఒక రూపాయి రాలేదు. బ్రిడ్జి నిర్మాణంలో వేసిన తాత్కాలిక బ్రిడ్జి అనేకసార్లు వరదలు వచ్చి కొట్టుకుపోయినా అదనపు ఖర్చు చేసి మరలా నిర్మించాను. బ్రిడ్జి నిర్మాణంలో భూమి కోల్పోయిన నిర్వాసితులకు పరిహారం అందకపోవడంతో వారు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నారు. దీంతో బ్రిడ్జి నిర్మాణం పనుల్లో జాప్యం జరిగింది. త్వరితగతిన బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని లేని పక్షంలో నిధులకు ఆటంకం కలుగుతుందని అధికారులు చెబుతున్నారు. వడ్డీలు భారీగా పెరిగిపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్‌ల బాధలను అర్థం చేసుకుని నిధులు విడుదల చేయాలి.

ఎత్తిపో(కో)తలేనా...!

- అర్ధాంతరంగా ఆగిపోయిన వరికుంట్ల చెరువు ఎత్తిపోతల పథకం
- ప్రసంగాలకే పరిమితమైన వైసీపీ నాయకుల హామీలు
- కూటమి ప్రభుత్వంలోనైనా పనులు ముందుకు సాగేనా


గంగనపల్లె తెలుగుగంగ కాలువ వద్ద అసంపూర్తిగా ఉన్న సంప్ నిర్మాణం


నిరుపయోగంగా ఉన్న పైపులు

కాశినాయన, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) మండలంలోని తెలుగంగ కాలువ పడమరవైపున ఉన్న గ్రామాల ప్రజలు సాగు, తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో తెలుగంగ ఎడమ కాలువ ప్రవహిస్తున్నప్పటికీ దాదాపు 70 శాతం సాగుభూమికి తెలుగంగ జలాలు అందని పరిస్థితి. ఇటుకులపాడు నుంచి గంగనపల్లె వరకు దాదాపు 9 గ్రామాల ప్రజలు తెలుగంగ జలాలకోసం దశాబ్దాల తరబడి ఎదురుచూపులు చూస్తున్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి రాజకీయ నాయకులు ఎత్తిపోతల ద్వారా తెలుగంగ నీరు ఇటుకులపాడు, సావిశెట్టిపల్లె, వరికుంట్ల, బాలాయపల్లె తదితర గ్రామాల్లోని చెరువులకు, కుంటలకు నీరు అందిస్తామని హామీ ఇస్తున్నా అది నేటికీ కార్యరూపం దాల్చలేదు.

మండలంలోని ఇటుకులపాడు వద్ద 2014-2019 సంవత్సరాలలో టీడీపీ అధికారంలో ఉండగా తెలుగంగ కాలువపై ఎత్తిపోతలకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇటుకులపాడు చెరువు నుంచి సావిశెట్టిపల్లె, వరికుంట్ల, బాలాయపల్లె తదితర చెరువులకు లింక్ చానల్ ద్వారా నీరు నింపాలని నిర్ణయించారు. అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారులు పలుమార్లు పర్యటించి నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. ఇంతలో ఎన్నికలు రావడం టీడీపీ అధికారం కోల్పోయి వైసీపీ అధికారంలోకి వచ్చింది. అయితే అనంతరం అధికారం చేపట్టిన వైసీపీ నాయకులు ఎత్తిపోతల పథకంపై దృష్టి పెట్టలేదు. ఈప్రాంత ప్రజలు ఎత్తిపోతలపై ఎంత మొత్తుకున్నా పట్టించుకున్న పాపానపోలేదు. తీరా ఎన్నికలు సమీ పిస్తున్న తరుణంలో మండల వాసి వైసీపీ ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డిపై ఒత్తిడి పెరిగింది. దీంతో పాత ప్రతిపాదనలు పక్కనబెట్టి కొత్తగా రూ.13కోట్లతో టెండరు ఖరారు చేసి వరికుంట్ల చెరువుకు నీరందించేందుకు ఎత్తిపోతల పథకానికి ఎన్నికలకు 3 నెలల ముందు కడప ఎంపీ అవినాష్‌రెడ్డితో కలిసి ఆగమేఘాలమీదల భూమిపూజ చేశారు. కోడ్ రాకముందే మాప్రభుత్వం అధికారంలో ఉండగానే ఎత్తిపోతల పథకం ప్రారంభించి ఓట్లు అడుగతామంటూ ప్రసంగించారు. కానీ ప్రజలు ఊహించినట్లే జరిగింది. గడువులోగా ఎత్తిపోతల పనులు పూర్తిగా లేదు. దాదాపు 90 శాతం పైప్‌లైన్ పనులు చేశారు గానీ సంప్ నిర్మాణం, మోటార్ల ఏర్పాటు, కరెంట్ సౌకర్యం తదితర కీలకమైన పనులు అర్ధాంతరంగా నిలిచిపో యాయి. అనంతరం వచ్చిన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటిపోయినా కాంట్రాక్టర్ పనులు తిరిగి ప్రారంభించ లేదు. ఇటీవల సావిశెట్టిపల్లె చెరువుకు ఎత్తిపోతల ద్వారా నీరందించే పథకానికి భూమిపూజకు వచ్చిన బద్వేల్ టీడీపీ ఇంచార్జి రితీష్‌రెడ్డి గంగనపల్లె వద్ద అర్ధాంతరంగా ఆగిని ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయించి వరికుంట్ల చెరువుకు నీరందిస్తామని ప్రకటించారు. అయితే పనులు మొదలు పెట్టకపోవడంతో ఈప్రభుత్వంలోనైనా వరికుంట్ల చెరువుకు ఎత్తిపోతల ద్వారా నీళ్ల అందుతాయే లేదోనని ప్రజల్లో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈవిషయంపై సంబంధిత అధికారిని వివరణ కోరగా దాదాపు రూ.11 కోట్లకు పనులు జరిగాయని, కాంట్రా క్టర్‌కు దాదాపు రూ.9 కోట్ల బిల్లులు రావాల్సి ఉందన్నారు. బిల్లులు అందగానే మిగిలిన పనులు పూర్తి చేయిస్తామన్నారు.

రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చింది వైసీపీనే

- ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చిందని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన తన ఇంటి వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని తంబళ్లపల్లె నియోజకవర్గం ములకల చెరువు వద్ద టీడీపీకి చెందిన ఒకరిద్దరు నకిలీ మద్యాన్ని తయారు చేస్తు న్న విషయం బయటకు పొక్కిందన్నారు. వెంటనే అధిష్టానం అప్రమత్తమై వారిపై చర్యలు తీసుకుందన్నారు. ఆ నియోజకవర్గంలో నకిలీ మద్యం తయారవుతోందంటే అంతో ఇంతో ఆ నియోజకవర్గ నాయకులకు తెలిసే ఉంటుందని, ఆ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి, సురేంద్రలను కూడా పార్టీ నుంచి సస్పెండ్ చేసిందన్నారు. ఇలాంటి వ్యవహారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు క్షమించరన్నారు. దీనిపై ఇంకా లోతైన దర్యాప్తు జరపాలని ఆ జిల్లాకు సంబంధం లేని వారిని నియమించి విజిలెన్స్ దర్యాప్తు చేయిస్తున్నారన్నారు. కానీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గోరంతను కొండంత చేసి రాష్ట్రంలో నకిలీ మద్యం తెచ్చి వేలకోట్ల రూపాయలను దోచుకుంటున్నారని రాద్ధాంతం చేస్తున్నారన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చి వేల కోట్ల రూపాయలను దోచుకున్నారన్నారు. ఇష్టమొచ్చిన బ్రాండ్లను తెచ్చి దాదాపు 35 లక్షల మంది ఆరోగ్యాలతో ఆడుకున్నారన్నారు.

డీకేటి భూముల కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

- ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎదురూరు బాబు


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

కడప మారుతీనగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దళితులు, మైనార్టీలకు ఇచ్చిన డీకేటి భూములను కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎదురూరు బాబు డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీకేదిన్నె మండలం ఇప్పెంట పంచాయతీ పరిధిలోని కాంపల్లె, ఇప్పెం ట గ్రామాల్లో మాదిగలు, మైనార్టీలకు సంబంధిత గ్రామ రెవెన్యూ పొలంలో 1999 సంవత్సరంలో సర్వే నెం.274లో 28 ఎకరాల భూమిని 22 మంది మాదిగలకు, మైనార్టీలకు 0-75 సెంట్ల డీకేటి భూమిని నాటి ప్రభుత్వం పట్టాలుగా ఇచ్చిందన్నారు. ఆ భూములకు సంబంధిత మండల రెవెన్యూ అధికారులు సర్వే చేయకపోగా హద్దులు కూడా ఏర్పాటు చేయలేదన్నారు. ఆ భూముల్లో పంటలు వేస్తూ వ్యవసాయం చేస్తుంటే కొంత మంది బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఆ భూమిని వారే కొన్నట్లుగా దళితులను, మైనార్టీలను భయభ్రాంతలకు గురి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి డీకేటి భూమిని వారికి చెందేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆర్ఎస్ రాజా, మాత య్య, ఎంసీపీ నాయకులు రెడ్డయ్య, సుబ్బరాయుడు, పీఎస్‌యు నాయకులు గోపీ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహర్షి వాల్మీకి జయంతి

కడప కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమం మంగళవారం 10-10 గంటలకు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9-30 గంటలకు ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న వాల్మీకి విగ్రహానికి పూలమాలలతో అలంకరణ కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లా అధికారులు, అనధికారులు, బీసీ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


రామ్మోహన్ మృతదేహం

కడప క్రైం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కడప నగరం వినాయక్‌నగర్ సర్కిల్ సమీపంలో సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామ్మోహన్ (39) అనే వ్యక్తి మృతి చెందాడు. కడప ట్రాఫిక్ సీఐ జావీద్ తన సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సీఐ వివరాల మేరకు.. వల్లూరు మండలం బీచువారిపల్లెకు చెందిన రామ్మోహన్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 14 ఏళ్ల క్రితం ఆయనకు వివాహం కాగా, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. సోమవారం ఉదయం 11.30గంటలకు ఇంటి నుంచి కడపకు ద్విచక్ర వాహనంలో బయల్దేరాడు. వినాయకనగర్ జంక్షన్ వద్దకు సమీపంలోకి రాగానే ఆగి ఉన్న బస్సును ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించి మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

బైకు కారు ఢీ....ఇద్దరికి గాయాలు

రైల్వేకోడూరు రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బైకు కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు..పోలీసులు అందించిన సమాచారం మేరకు మండలంలోని అనంతరాజుపేట పంచాయతీలోని కట్టపుట్టాలమ్మ గుడి సమీపంలో తిరుపతి వైపు వెళ్తున్న కారు, కడప వైపు వెళ్తున్న మోటార్ బైకును ఢీకొంది. దీంతో బైకుపై వెళ్తున్న ఓబులవారిపల్లి మండలం బొమ్మవరం గ్రామానికి చెందిన శంకర, రాజంపేటకు చెందిన వెంకట రమణ గాయపడ్డారు. స్థానికులు 108 వాహనంలో వారిని కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ప్రాథమిక చికిత్స అనంతరం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీప్రసాద్ రెడ్డి తెలిపారు.

కారు ఢీకొని ఇద్దరికి...

బద్వేలుటౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బయనపల్లె వద్ద సోమవారం సాయంత్రం కారు ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. భావనారాయ నగర్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మనోహర్‌రెడ్డి విధులు ముగించుకొని తండ్రి సూర్యప్రకాష్‌రెడ్డితో కలిసి ద్విచక్ర వాహనంలో స్వగ్రామం సోమేశ్వరం గ్రామానికి బయలుదేరాడు. బయనపల్లె వద్దకు రాగానే కారు ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తీసుకువెళ్లారు.

వర్షానికి కూలిన మట్టిమిద్దె

వీరపునాయునిపల్లె, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వీరపునాయునిపల్లెలోని ఎర్రంపల్లె రహదారిలో ఉన్న నర్రావుల భాస్కర్‌రెడ్డికి చెందిన మట్టిమిద్దె కూలిపోయింది. సోమవారం తెల్లవారుజాము 4గంటల ప్రాంతంలో కురిసిన వర్షంతో ఉదయం 8గంటల ప్రాంతంలో కూలిపోయింది. ఇంటిలో కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఇంట్లోని సామగ్రి అంతా పనికిరాకుండా పోయిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

రాంగ్ రూటులో వచ్చి.. లారీని ఢీకొన్న కారు

- బ్రేక్ వేయడంతో లారీ వెనుక నాలుగు వాహనాలు ఢీ


ప్రమాదంలో లారీల మధ్యలో పాక్షికంగా దెబ్బతిన్న కార్లు

పుల్లంపేట, అక్టో బరు 6 (ఆంధ్రజ్యోతి) : ముగ్గురు యువకులు మద్యం తాగి కారులో రాంగ్ రూటులో వచ్చి లారీని ఢీకొనడంతో.. లారీ వెనుకవైపున నాలుగు వాహనాలు వరుసగా ఒకదానినొకటి ఢీకొన్నాయి. టిప్పర్ డ్రైవర్ సమయస్ఫూర్తితో రెండు కార్లలో ఉన్న 10 మంది ప్రమాదం నుంచి బయట పడ్డారు. సోమవారం రాత్రి ముగ్గురు యువకులు మద్యం తాగి కారులో రాజంపేట నుంచి రైల్వేకోడూరు వైపు రాంగ్ సైడ్‌లో వెళుతూ ఉడుమువారిపల్లె సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నారు. ప్రమాదాన్ని కొద్ది క్షణాలు ముందుగానే పసిగట్టిన లారీ డ్రైవర్ బ్రేక్ వేయడంతో కారు పాక్షికంగా దెబ్బతింది. కాగా ఈ లారీ వెనుకవైపు మరో లారీతో పాటు రెండు కార్లు వస్తున్నాయి. వాటి వెనకే ముగ్గురాయితో మంగంపేట నుంచి కడపకు వెళుతున్న టిప్పర్ డ్రైవర్ ప్రమాదాన్ని పసిగట్టి పక్కకు తిప్పడంతో కారు వెనుక వైపు సైడ్ ఢీకొంది. దీంతో రెండు కార్లలో ఉన్న 15 మంది సురక్షితంగా బయటపడ్డారు. టిప్పర్ డ్రైవర్ సమయస్ఫూర్తితో రెండు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అయితే, ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాల కాలేదు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేసి మద్యం మత్తులో ఉన్న యువకులను పోలీసుస్టేషన్‌కు తరలించారు.

శాశ్వత పరిష్కారం చూపాకే పనులు

- టెయిలింగ్‌పాండ్ వద్ద కేకే కొట్టాల ప్రజల ఆందోళన


యూసీఐఎల్ టెయిలింగ్‌పాండ్ వద్ద కేకే కొట్టాల ప్రజల నిరసన

పులివెందుల/వేముల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మా గ్రామానికి శాశ్వత పరిష్కారం చూపాలని.. లేదంటే టెయిలింగ్‌పాండ్ విస్తరణ పనులు సాగనివ్వమని కేకే కొట్టాల గ్రామ ప్రజలు తేల్చి చెప్పారు. సోమవారం టెయిలింగ్‌పాండ్‌కు వెళ్లే దారిలో బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదారేళ్లుగా టెయిలింగ్ పాండ్‌తో అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఎన్నిమార్లు యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (యూసీఐఎల్) వారికి విన్నవించినా పట్టించుకోలేదన్నారు. 2018, 2021 రెండు దఫాలుగా టెయిలింగ్‌పాండ్ విస్తరణ పనులు చేపట్టారన్నారు. ఆ సమయంలో తీవ్ర నిరసనలు వ్యక్తం చేసినప్పటికీ అప్పటికి హామీలు ఇచ్చి.. వారి పబ్బం గడుపుకున్నారన్నారు. 2018లో జిల్లా కలెక్టర్ హరికిరణ్ ఏడాదిన్నరలోపు మీ సమస్యలు తీరుస్తామని హామీ ఇచ్చినా.. ఇప్పటికీ అమలు కాలేదన్నారు. టెయిలింగ్ పాండ్ కారణంగా భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయన్నారు. దీంతో తాగునీటికి, సాగునీటికి ఇబ్బందిగా మారిందన్నారు. పంటల సాగుకు వినియోగిస్తున్న బోరు బావుల్లో యురేనియం వ్యర్థాలు కలుస్తూ అనేక అరోగ్య సమస్యలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మా గ్రామాన్ని పూర్తిగా యూసీఐఎల్ స్వాధీనం చేసుకొని.. ప్రజలంద రినీ వేరేచోటకు పంపించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

గండికోట ముంపు బాధితులకు న్యాయమైన పరిహారం

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి


మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

కడప కలెక్టరేట్/ కొండాపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గండికోట ముంపు నిర్వాసితులకు పునరావాసం కల్పించడంతో పాటు న్యాయమైన పరిహారం అందేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో గండికోట జలాశయ ముంపు వాసులకు పునరావాసం, పరిహారం, మౌలిక సదుపాయాలు కల్పి ంచే అంశమై కలెక్టర్‌తో పాటు జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, జేసీ అదితిసింగ్, ఆర్డీవో సాయిశ్రీ, ఎస్డీసీలు శాంతమ్మ, నీలమయ్యలతో కలసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గండికోట రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేసి జిల్లాను సస్యశ్యామలం చేసిందన్నారు. నీటి నిల్వ సామర్థ్యం పెంపు విషయంలో మరికొన్ని గ్రామాలు ముంపునకు గురికావడంతో ఆయా గ్రామస్థులకు కూడా పరిహారం, పునరావాసం కల్పించడం జరిగిందన్నారు. అందుకు సంబంధించి నివాస గృహాలను, లబ్ధిదారులకు వారి పేరుతో ధ్రువీకరణ రిజిస్ట్రేషన్ చేయించి అందించేందుకు తక్షణం చర్యలు చేపడతామన్నారు. కొండాపురం మండలంలో 3 గ్రామాలకు పరిహారం అందాల్సి ఉందన్నారు. మొత్తం 22 గ్రామాల వరకు ముంపునకు గురయ్యాయని, వారందరికీ పరిహారం, పునరావాసం కూడా కల్పించినట్లు తెలిపారు. అలాగే 26 గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించామని, పునరావాసం కల్పించే విషయంలో కొన్ని అంశాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ప్రకారం అందాల్సిన పరిహారం, నిధులు, పునరావాస కల్పనలో భాగంగా మౌలిక సదుపాయాలు కల్పించడంలో పూర్తి స్థాయిలో పనులు చే పట్టాల్సి ఉందన్నారు. సామాజిక ఆర్థిక సర్వే విషయంలో కూడా పూర్తిస్థాయి వివరాలు అందాల్సి ఉందన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ గండికోట రిజర్వాయర్ కోసం భూములు, ఇళ్లను కోల్పోయిన నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. పునరావాస కాలనీల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అనంతరం ముంపు గ్రామాలకు సంబంధించిన సమస్యలపై నిర్వాశితుల నుంచి కలెక్టర్, ఎమ్మెల్యేలు అర్జీలు స్వీకరించారు.

ఈ సందర్భంగా గండికోట నిర్వాసితులు పునరావాసం కింద నిర్మించుకున్న ఇళ్లకు ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని, హౌసింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. ముంపునకు గురైన తర్వాత కొన్ని పంచాయతీలు పునర్విభజన కాలేదని, వాటిని పునర్విభజన చేయాలన్నారు. కొండాపురం పట్టణంలో ముంపునకు గురైన హైస్కూల్, కాలేజి స్థానంలో వెంటనే కొత్త స్కూల్, కాలేజీని ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా ముంపునకు గురైన ప్రభుత్వ ఆఫీసుల స్థానంలో కొత్త ఆఫీసులను నిర్మించాలని కోరారు. కొన్ని కాలనీల్లో శ్మశానవాటికలు, రోడ్లు , డ్రైనేజీలు లేవని, వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు కలెక్టర్, తమ పరిధిలో వాటిని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని, మిగిలిన వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్డీవో ఆదిమూలం సాయిశ్రీ, ఇతర శాఖల అధికారులు, గండికోట నిర్వాసితులు పాల్గొన్నారు.

ఆదర్శం.. ఆ గురుకులం

- గుండ్లకుంట పాఠశాలకు స్వచ్ఛాంధ్ర పురస్కారం
- పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థుల హర్షం


గురుకుల పాఠశాల ప్రధాన భవనం

జమ్మలమడుగు, అక్టోబరు 6 (ఆంధ్ర జ్యోతి): పెద్దముడియం మండలం గుండ్లకుంట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల రాష్ట్రస్థాయి స్వచ్ఛాంధ్ర పురస్కారానికి ఎంపి కైంది. రాష్ట్రంలో స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రకటనలో భాగంగా రెసిడెన్షియల్ స్కూలు విభాగంలో గుండ్లకుంట గ్రామంలోని గురుకుల పాఠశాలకు స్థానం దక్కింది.

గుండ్లకుంట గ్రామంలోని గురుకుల పాఠశాల సుమారు పది ఎకరాల సువిశాల విస్తీర్ణం ఉంది. అన్ని రకాల వసతులతో ఏర్పాటు చేసిన భవన సముదాయం, పాఠశాల ఆవరణలో మొక్కల పెంపకం ఎంతో అందంగా ఆహ్లాదంగా కనిపిస్తుంది. ఇటీవల జిల్లా స్థాయి అధికారుల బృందం ఆదర్శ పాఠశాలల ఎంపికలో భాగంగా పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కల పెంపకం, పరిశుభ్రత, బాత్‌రూం నిర్వ హణ, వంట గదుల శుభ్ర త ఇలా అన్ని రకాలుగా పరిశీలించారు. అలాగే విద్యార్థుల్లో స్వచ్ఛ భారత్, స్వచ్ఛాం ధ్ర పట్ల అవగాహన గురించి ఆరా తీశారు. విద్యార్థులు బసచేసే వసతి సము దాయా లన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు చేతుల పరి శుభ్రత, పరిసరాల పరిశుభ్రత తదితర వాటిపై అన్ని రకాలుగా బృందం పరిశీలించి తగు నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. ఈ క్రమంలో పాఠశాలకు రాష్ట్రస్థాయిలో అవార్డు రావడం గమనార్హం. మొత్తమ్మీద గుండ్లకుంట గురుకుల పాఠశాల రాష్ట్రస్థాయి స్వచ్ఛ అవార్డు ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపాల్ ఎం.సుజాత, ఉపాధ్యాయులు, సిబ్బందితో పాటు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పాఠశాల ఆవరణలో అందంగా కనిపిస్తున్న సిమెంటురోడ్డు, మొక్కలు నాటుతున్న విద్యార్థినులు

గోకులం షెడ్ల నిర్మాణానికి చేయూత

● ఎమ్మెల్యే విప్ అరవ శ్రీధర్

రైల్వేకోడూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం చేయూత ఇస్తోందని రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ తెలిపారు. సోమవారం రైల్వేకోడూరు మండలంలోని వెంకటరెడ్డిపల్లె దళితవాడలో గోకులం షెడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రైల్వేకోడూరు మండలానికి 46 షెడ్లు మంజూరు చేయగా, 25 షెడ్లు పూర్త య్యాయన్నారు. పల్లెపండుగ 2.0 లో భాగంగా మిగిలిన షెడ్లను పూర్తి చేసేందుకు అధికారులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. రెండు పశువుల షెడ్డుకు రూ. 1,25,000, నాలుగు పశువుల షెడ్డుకు రూ. 1,85,000లు, ఆరు పశువుల షెడ్డుకు రూ. 2 లక్షలు ప్రభుత్వం ఇస్తుందన్నారు. టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి మాట్లాడుతూ పాల ఉత్పత్తి పెంపు, రైతులకు ఆర్థికంగా మద్దతుతో పాటు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వం బలోపేతంచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగిరెడ్డి, ఉపాధి ఏపీవో మృత్యుంజయనాయుడు, పశు వైద్యాధికారి ప్రతాప్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గోకులం షెడ్డుకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

అమరగాయకుల విగ్రహాల ఏర్పాటుకు అనుమతించండి

రాజంపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఘంటసాల వెంకటేశ్వరావు, ఎస్పీ బాల సుబ్రమణ్యం విగ్రహాల ఏర్పాటుకు అనుమతించడంతోపాటు అనువైన స్థలాలను మంజూరు చేయాలంటూ రాజంపేట సబ్‌కలెక్టర్ హెచ్‌ఎస్ భావనతోపాటు జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం వినతిపత్రాలు సమర్పించినట్లు కళాంజలి సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.కళాంజలి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 4న ఘంటసాల జయంతి, ఫిబ్రవరి 11 న వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతి, వర్ధంతి కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామన్నారు.

పరామర్శ

ఒంటిమిట్ట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మలకాటిపల్లెకు చెందిన టీడీపీ నేత కుమారి శివారెడ్డి భార్య రేణుక ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆ గ్రామానికి రేణుక పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల్లో పాల్గొన్నారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు ముద్దు కృష్ణారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, నాయకులు లక్ష్మీనారాయణ నాయుడు, న్యాయవాది రామదాసు, ఫిష్ రమణ పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి బాధాకరం

రాయచోటి-నేతాజీ సర్కిల్ , అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండలం నాయుని వారి పల్లెకు చెందిన టీడీపీ కార్యకర్త వెంకటాద్రి నాయుడు మృతి బాధాకరమని రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు సోమవారం అన్నారు. వెంకటాద్రినాయుడు ఆదివారం రోడ్డు ప్రమాదంలో గాయపడి మరణించిన విషయం తెలియడంతో, వారి స్వగ్రామానికి చేరుకుని భౌతిక కాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ సీనియర్ కార్యకర్తలను కోల్పోవడం చాలా బాధాకరమన్నారు.

నష్టపోయిన ప్రతిరైతును ఆదుకుంటాం

● రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు

ఒంటిమిట్ట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : పెనుగాలులకు నష్టపోయిన ప్రతి రైతును కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్ మోహన్ రాజు హామీ ఇచ్చారు. సోమవారం సిద్దవటం మండలంలోని లింగంపల్లె, కడపాయపల్లె, మంగంపల్లె, ఎస్.రాజంపేట, వంతాటిపల్లెల్లో ఆయన పర్యటించారు. ఆదివారం రాత్రి గాలివాన బీభత్సంతో దెబ్బతిన్న పైర్లను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతన్నలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అధికారులు పంట నష్టంపై అంచనాలు తయారు చేయాలని సూచించారు. పెన్నా నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నదిని ఆనుకుని ఉన్న భూములు కోతకు గురికాకుండా చూడాలని రైతులు చమర్తి దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం మండల టీడీపీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఒంటిమిట్ట జడ్పీటీసీ సభ్యుడు ముద్దుకృష్ణారెడ్డి, మంటపంపల్లె ఎంపీటీసీ సభ్యుడు బాషా, సిద్దవటం మండల నాయకులు నాగమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న వరిపైరును పరిశీలిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

వెలుగు యానిమేటర్లకు బకాయిలు చెల్లించాలి

రైల్వేకోడూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): వెలుగు శాఖలో పని చేస్తున్న యానిమేటర్లకు పెండింగ్ బిల్లులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం రైల్వేకోడూరు వెలుగు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5జీ మొబైల్ సిమ్‌కార్డును వెంటనే ఇవ్వాలన్నారు. ఆన్‌లైన్ పని భారాన్ని తగ్గించాలని, కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, కనీస వేతనాలు చెల్లించాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, రూ. 10 లక్షల గ్రూప్, వీవోఏ ఇన్సూరెన్సు సౌకర్యం కల్పించాలని, అర్హులైన వారికి సీసీలుగా ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, 2 సంవత్సరాల స్త్రీనిధి ఇన్సెంటివ్స్ ఇవ్వాలని, రాజకీయ వేధింపులు అక్రమ తొలగింపులు ఆపాలని, వ్యక్తిగత అకౌంట్‌లో గౌరవవేతనాలు వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీవోఏ సంఘ నాయకురాళ్లు నాగవేణి, సోనియా, ప్రసన్న, వసంత, జయలక్ష్మి, సునీత, లావణ్య, కవిత, బుజ్జమ్మ, అనిత, శ్రీదేవి, అరుణమ్మ, గంగమ్మ, విజయ, రమాదేవి, శైలజ, నందీశ్వరి, చంద్రావతి, శోభ, సరస్వతి, నాయకులు ముని కృష్ణ, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



వెలుగు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ, వీవోఏల నాయకులు

సౌమ్యనాథాలయంలో విద్యార్థుల ఎక్స్‌పోజర్ విజిట్



సౌమ్యనాథస్వామి ఆలయంలో విద్యార్థులు

నందలూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎక్స్‌పోజర్ విజిట్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొత్త బోయనపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం కొత్తబోయనపల్లెలోని 108 అడుగుల అన్నమయ్య విగ్రహం, గుండ్లూరులోని సాయిబాబా ఆలయం, నందలూరు మండలంలోని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మున్సిఫ్ కోర్టు, రైల్వేస్టేషన్, నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సౌమ్యనాథస్వామి ఆలయం, బౌద్ధరామాలు తదితర ప్రాంతాలను సందర్శించారు. వాటి ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు ఓబులేశు, ఎస్వీ రామరాజు, రాజయ్య, అనిల్‌కుమార్, అమరావతి, ప్రణవిలు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయులకు పరీక్ష' నిబంధన సరికాదు

రాజంపేట టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు పరీక్ష పాస్ కావాలని నిబంధన పెట్టడం సరికాదని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు అన్నారు. సోమవారం రాజంపేట ఉర్దూ(గర్ల్స్) హైస్కూల్లో నిర్వహించిన అసోసియేషన్ డివిజనల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంటీఎస్ టీచర్లకు 12 నెలల వేతనం ఇచ్చి రెగ్యులర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఏ యూనియన్, రాజంపేట డివిజన్‌లోని సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీసీబీ డిజైన్ అండ్ ఫ్యాబ్రికేషన్‌పై వర్క్‌షాపు

రాజంపేట, స్థానిక అన్నమాచార్య యూనివర్సిటీ ఈసీఈ విభాగంలో నెల్లూరు టెక్నోట్రాన్ సొల్యూషన్స్ సంస్థ సహకారంతో పీసీబీ రూపకల్పన, డిజైన్ అండ్ ఫ్యాబ్రికేషన్‌పై మూడు రోజుల పాటు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ డాక్టర్ ఈ సాయిబాబారెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్ఎంవీ నారాయణ, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ బాల మునెయ్య సోమవారం వర్క్‌షాపును ప్రారంభించారు. ఇలాంటి వర్క్‌షాపులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందిస్తాయన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు : ఎంఈవో

ఒంటిమిట్ట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ సంస్కరణలపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి నట్లు ఎంఈవో-2 బ్రహ్మయ్య తెలిపారు. చిత్రలేఖన పోటీల్లో ఒంటిమిట్ట పాఠశాలకు చెందిన సాయిలక్ష్మి, మాధవరం పాఠశాలకు చెందిన సాయి కుమార్, చింతరాజుపల్లెకు చెందిన వెంకట దీక్షిత, వ్యాసరచన పోటీల్లో ఒంటిమిట్ట పాఠశాలకు చెందిన వర్షిత, కొత్తమాధవరం పాఠశాలకు చెందిన ప్రవస్తి, ఒంటిమిట్ట పాఠశాలకు చెందిన దీపిక మొదటి, రెండు, మూడు స్థానాలు సాధించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుజాతమ్మ, ఎంఈవో-1 లావణ్య తదితరులు పాల్గొన్నారు.



చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

అనధికార టాలెంట్ టెస్టులను నిషేధించాలి

రాజంపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : టాలెంట్ టెస్టుల పేరుతో డబ్బు వసూలు చేయడంతో పాటు, ఈ సందర్భంగా సేకరిస్తున్న సమాచారాన్ని అడ్మిషన్లకు వినియోగించుకుంటున్న నారాయణ, శ్రీ చైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని రాజంపేట అపుస్మా అధ్యక్షుడు ప్రభాకర్‌నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక రాజు విద్యాసంస్థలో ప్రైవేటు పాఠశాలల యూనియన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలు నిర్వహించే టాలెంట్ టెస్టులపై అధికారులు చర్యలు తీసుకోకుంటే తామే అడ్డుకుంటామని హెచ్చరించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి సుభాష్ మాట్లాడుతూ నిరుద్యోగులు నడుపుకుంటున్న చిన్న చిన్న ప్రైవేటు సంస్థల విద్యార్థులను మభ్యపెడుతున్న స్కాలర్‌షిప్ టెస్టులను నిషేధించాలన్నారు. ఈ కార్యక్రమంలో అపుస్మా జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, కోశాధికారి నందకిశోర్, నాయకులు చౌదరి, సుబ్బరాయుడు, రఘురామరాజు, భరత్ కుమార్‌రాజు, ప్రైవేటు పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌నాయుడు

IN THE COURT OF THE HONOURABLE ADDITIONAL SENIOR CIVIL JUDGE, KADAPA.

I.P. No. 62 / 2025

Chilekampalli Prasad Reddy Son of C. Ramakrishna Reddy, Hindu, aged about 49 years, Business, residing at Door No. 143, Vallur Village and Mandal, YSR Kadapa District. - Petitioner/Debtor.

Vs

1) D. Jayakrishna Reddy S/o Ramakrishna Reddy, Hindu, aged about 48 years, residing at D.No. 11-34, Gunikuntla Road, Near S.P. House, Rayachoty Town and Mandal, Annamayya District, Cell : 9701925177, 2) T. Akram S/o Usain Sab, aged about 38 years, Residing at D.No. 3/39, Masapeta, Rayachoty Town and Mandal, Annamayya District, Cell : 7799554479, 3) S. Haleem Son of Hazrath, aged about 60 years (Rice Business), residing at D.No. 10/18, Gandhi Bazar, Rayachoty, Town and Mandal, Annamayya District, Cell : 9966464682. 4) T. Sesha Reddy S/o Veera Nagi Reddy, aged about 55 years, Residing at D.No. 6/4, Konthukurupalli, Bandapalli Village, Ramapuram Mandal, Annamayya District, Cell : 6300163840, 5) C. Narasimhulu S/o Venkata Ramana, Aged about 50 years, Milk Business, Residing at D.No. 16/64, Masapeta, Reddyvariplali Village, Rayachoty Town and Mandal, Annamayya District, Cell ; 8688077828, 6) Prathap Reddy S/o Reddappa Reddy, aged about 32 years, Milk Business, Residing at D.No. 6/18, Kothapeta, Rayachoty town and Mandal, Annamayya District, 7) Siva S/o not known, aged about 35 years, Reliance Petrol Bunk, Residing at Nallaguttapalli Village, Ramapuram Mandal, Annamayya District, 8) G. Murali S/o not known, aged about 55 years, Kirana Shop, Residing at D.No. 8/301, Opp. Collector Office, Rayachoty Town and Mandal, Annamayya District. 9) Manohar S/o not known, aged about 42 years, Police Constable, Traffic Police Station, Rayachoty Town and Mandal, Annamayya District, Cell : 7189420565, 10) Venkata Ramana, S/o Venkata Subbaiah, aged about 45 years, Business Residing at Patha Rayachoty, Rayachoty Town and Mandal, Annamayya District, Cell : 9959765391, 11) S. Basi Reddy, S/o S. Basireddy, aged about 58 years, Rice Dealer, Residing at D.No. 5/3, Ponthukurpalli Village, Badapalli Village, Ramapuram Mandal, Annamayya District, 12) S. Basireddy S. Sidda Reddy, aged about 45 years, Business, Residing at D.No. 26/131, Badapalli Village, Ramapuram Mandal, Annamayya District, 13) Pasupuleti Nagendra S/o P. Subbaiah, aged about 39 years, Auto, Residing at D.No. 8/106, Patha Rayachoty, Rayachoty Town and Mandal, Annamayya District, Cell : 9059303466, 14) S. Basireddy S/o S. Basireddy, aged about 60 years, Financier, Residing at D.No. 5/57, Ponthukuripalli Village, Badapalli Village, Ramapuram Mandal, Annamayya District, Cell : 9121522920, 15) Pasupathi Sudhakar S/o P. Krishnaiah, aged about 34 years, Business, Residing at D.No. 7/17, Ponthukurpalli Village, badapalli Village, Ramapuram Mandal, Annamayya District, Cell : 9701066353, 16) T. Chandra Sekhar Reddy s/o Veera Nagi Reddy, aged about 43 years, residing at D.No. 6/4, Ponthukurpalli Village, Badapalli Village, Ramapuram Mandal, Annamayya District, Cell : 9704964686. - Respondents/Creditors

జనరల్ నోటీసు

పైన తెలిపిన పిటిషనరు/డెటార్ తనను ఇన్సాల్వెంటుగా డిక్లేర్ చేయమని కోరుచు రాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, కడప కోర్టు యందు ఐ.పి. నెం. 62/2025పై తెలిపిన రెస్పాండెంట్స్/క్రెడిటర్స్ పైన దాఖలు చేసి వున్నారు. సదరుకేసు 27-10-2025వ తేదిన ఉదయం 10.30 గంటలకు వాయిదా ఉన్నది. ఎవరికైన, ఏవైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు వారి ఎదుట ప్రత్యక్షముగా కానీ, వకీలు ద్వారా గానీ హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకోవలెను, లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడును.

Smt. N. ANURADHA, B.A., LLB, Advocate, Kadapa City, Cell : 98668 06880


చీఫ్ జస్టిస్‌పై దాడికి యత్నించిన వారిని శిక్షించాలి

● భారత న్యాయవాదుల సంఘం డిమాండ్

రాయచోటిటౌన్, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై సోమవారం దాడి చేయడానికి ప్రయత్నించడంతోపాటు సనాతన ధర్మాన్ని అవమానించిన వారిని వదిలిపెట్టమని కేకలు వేయడం దారుణమని, అతనిపై తక్షణం కఠిన చర్యలు తీసుకోవాలని భారత న్యాయాదుల సంఘం (ఐఏఎల్) కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ టీ. ఈశ్వర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్. ఆనంద్‌కుమార్ డిమాండ్ చేశారు సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ తాను బాధ్యతలుచేపట్టిన రోజునే భారత రాజ్యాంగమే సుప్రీం అని ప్రకటించారని, ఆ రోజు నుంచి మత చాందసవాదులు, రాజ్యాంగ వ్యతిరేక శక్తులు ప్రధాన న్యాయమూర్తిపై కన్నేసి ఉంచారని, న్యాయవ్యవస్థ తాము చెప్పినట్లే నడుచుకోవాలని రాజ్యాంగం చెప్పినట్లు కాదని ఆలోచిస్తున్న వారి కుట్రలో భాగమే ఈ దాడి ప్రయత్నం అన్నారు. ఈ వైఖరి దేశానికి చాలా ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది జస్టిస్ గవాయిపై దాడిగా చూడాల్సిన అవసరం లేదని, ప్రజాస్వామ్యానికి వెన్నెముకగా భావించే న్యాయవ్యవస్థపై దాడిగానే చూడాలని, ప్రజలు ప్రజాస్వామ్యవాదులు ఇలాంటి దాడులను తీవ్రంగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఏఎల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

13న అంగన్‌వాడీల మహా ధర్నా

రాయచోటిటౌన్,అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): అద్దెలు, కూరగాయల బిల్లులు, వేతన బకాయిలు వెంటనే చెల్లించాలంటూ ఈ నెల 13న రాయచోటి ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించనున్న మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు పిలుపునిచ్చారు. ప్రభుత్వం బడ్జెట్ కేటాయించ కపోవడమే బిల్లుల జాప్యానికి కారణమని, తన చేతుల్లో ఏమీ లేదని సీడీపీవో శశికళ సోమవారం ప్రకటించడంతో, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐ టీయూ) రాయచోటి నాయకులతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకపోగా, బిల్లులు ఇస్తే చాలనే పరిస్థితికి అంగన్వాడీలను తీసుకువస్తే వైసీపీకి పట్టిన గతే కూటమి ప్రభుత్వానికి కూడా పడుతుందని హెచ్చరించారు. అర్బన్‌లో ప్రతి వర్కర్‌కి రూ.60 వేలు, రూరల్‌లో రూ.50 వేలు చొప్పున ప్రభుత్వం బకాయి పడడంతో అంగన్వాడీ వర్కర్లు అప్పులపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నెలలుగా బడ్జెట్ కేటాయించకపోతే సెంటర్లు ఏ విధంగా నిర్వహించాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి డీ. భాగ్యలక్ష్మి ప్రశ్నించారు. రేషన్ డీలర్లు, అధికారులు ఒకరి మీద ఒకరు సాకులు చెబుతూ బియ్యం, కందిపప్పు, ఆయిల్ సరఫరా చేయలేదని ఆరోపించారు. శనివారం లోగా పెండింగ్ బిల్లులు, జీతాలు విడుదల చేయకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ లీడర్లు సిద్దమ్మ, సుమలత, విజయమ్మ, సురేఖ, భూదేవి, శంకరమ్మ, పద్మజ, షబానా, కళావతి, పీరమ్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



ప్రాజెక్టు కార్యాలయం వద్ద మాట్లాడుతున్న సీఐటీయూ ప్రధాన కార్యదర్శి రామాంజులు

రహదారులకు మరమ్మతులు చేయాలని వినతి

సుండుపల్లె, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రహదారులకు మరమ్మతులు చేయాలంటూ సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేసినట్లు నియోజకవర్గ జనసేన నాయకుడు రామా శ్రీనివాస్ తెలిపారు. సుండుపల్లె- రాయచోటి, రాయచోటి - రాజంపేట డబుల్ రోడ్డు పనులు అర్థాంతరంగా ఆగిపోయాయని తెలిపామన్నారు. అగ్రహారం నుంచి సామిసేనిగడ్డ వరకు సుమారు 9 పల్లెలకు వెళ్లే రహదారి గుంతలమయం కావడంతో వాహనదారులకే కాకుండా బాటసారులు సైతం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మాధవ్, రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులకు వినతిపత్రాలు అందజేశామన్నారు. ఆయా వినతిపత్రాల కాపీలను కూడా కలెక్టర్‌కు అందజేసినట్లు తెలిపారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జనసేన నేత రామాశ్రీనివాస్

ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై కేసులు పెట్టాలి

ఓబులవారిపల్లె, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం, బీకేఎంయూ, సీపీఐ కార్యకర్తలు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని బాలిరెడ్డిపల్లె, ఎర్రగుంట కోట పంచాయతీలో సర్వేనంబరు 1155లో 120 ఎకరాలు, 1295/1, 1295/2, 1295/3, 1295/4, 1295/5, 1294/1, 1294/2 సర్వేనంబర్లలో 70 ఎకరాల భూమిని గిరిజనులు సాగు చేసుకునే వారు. ఈ భూమిని గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దారు అక్రమంగా అగ్రవర్ణాల వారికి కట్టబెట్టారని ఆరోపించారు. ఆ భూముల విషయంలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు ఆ భూమలను శివాజినగర్ లోని గిరిజనులతోపాటు బాలిరెడ్డిపల్లెలోని ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కేటాయించాలని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, నియోజక వర్గ కార్యదర్శి జయరామయ్య, జ్యోతి చిన్నయ్య, చింతలపూరి నాగమ్మ, మండల కార్యదర్శి మల్లిక, వెంకటరమణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిద్దిగాళ్ల శ్రీనివాసులు, బాలిరెడ్డిపల్లె, వై.కోట, శివాజీనగర్ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

దళితవాడల్లో కనీస వసతులు కల్పించాలి



ఆందోళన చేస్తున్న అరవీడు గ్రామస్తులు

రాయచోటి కలెక్టరేట్ , అక్టో బరు 6 (ఆంధ్రజ్యోతి): దళితవాడల్లో సీసీ రోడ్లు వేయాలం టూ సీపీఐ నాయకులు సో మవారం అన్నమయ్య కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ. స్వాతంత్రం వచ్చి 78 ఏళ్ల గడిచినా అలకాన్‌చెరువు హరిజనవాడకు రహదారి ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. అత్యవసర వైద్య సేవలు అందక సరైన రవాణా మార్గం లేక పలువురు ప్రాణాలు కోల్పోయినా పాలకులు పట్టించుకోకపోవడం దురదృష్టకరమని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రజా ప్రతి నిధులు, ఉన్నతాధికారులు స్పందించి శాశ్వత రహదారి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జ్యోతిచిన్నయ్య, మర్రి సుమిత్ర, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పండుగోళ్ల మనీ, కార్మిక సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

రాయచోటి(నేతాజీ సర్కిల్), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రామాపురం మండలం చిట్లూరు గ్రామం ఏకిలపల్లెలో శ్మశాన స్థలాన్ని ఆక్రమణల బారి నుంచి రక్షించాలని ఆ గ్రామస్తులు సోమవారం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 871/1, 871/5నంబర్లలోని 5 ఎకరాల భూమిని గాలివీటి బసమ్మ పేరుతో పట్టాదారు పాసుపుస్తకం సృష్టించుకుని, సోమవారం జేసీబీతో పనులు ప్రారంభించడంతో అడ్డుకున్నట్లు తెలిపారు. ఎన్నో ఏళ్లగా శ్మశాన వాటికగా ఉపయోగించుకున్న భూమిని యథావిధిగా ఉంచి న్యాయం చేయాలని కోరారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఏకిలపల్లెవాసులు

మార్కెట్‌లో వేలం సమయాలు మార్చాలి


కూరగాయల మార్కెట్‌లో కూరగాయల వేలం సమయాలు మార్చాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి, రాయచోటి ఏరియా అధ్యక్షుడు హరినాథనాయుడు సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ మార్కెట్‌కు 9 మండలాల రైతులు కూరగాయలు, ఆకుకూరలు తీసుకువస్తారని తెలియజేశారు. అర్ధరాత్రి సమయంలో కూరగాయల వేలం నిర్వహిస్తుండడంతో రైతులు అష్టకష్టాలు పడాల్సి వస్తోందన్నారు. రైతులకు అనుకూలమైన సమయంలో వేలం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రేపటి నుంచి మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 8, 9వ తేదీల్లో లక్కిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల కోఆర్డినేటర్ చక్రపాణి ఒక ప్రకటనలో తెలిపారు. జాండ్రపల్లి జిల్లా ఉన్నత పాఠశాలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే బాలబాలికలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయుల సంతకాలతో కూడిన అనుమతి పత్రాలతో విద్యార్థులు హాజరు కావాలన్నారు.

వాహనదారులకు పర్మిట్లు తప్పనిసరి

రామాపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వాహనదారులందరూ వాహనానికి సంబంధించిన పర్మిట్లు, ధ్రువ పత్రాలు కలిగి ఉండాలని మోటారు వెహికల్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ గాయత్రి తెలిపారు. కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కొత్తరోడ్డు నారాయణపురంలోని పోలీస్ చెక్‌పోస్టు వద్ద సోమవారం సాయంత్రం ఆమె వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ తప్పకుండా కలిగి ఉండాలని తెలిపారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎంవీఏఐ గాయత్రి

నీటమునిగిన వీధుల పరిశీలన

నందలూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరవపల్లెలో నీటమునిగిన వీధులను సోమవారం ఎంపీడీవో రాధాకృష్ణ, డీఈ శ్రీనివాసులు, పంచాయతీ సెక్ర టరీ సురేష్ బాధితులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. నీటి సంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బయ్యను పిలిపించి చెరువకు నీటిని తరలించే కాలువలో ప్రవాహాన్ని తగ్గించాలని సూచించారు. సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని హామీ ఇచ్చారు. ఇంత జరుగుతున్నా ఇరిగేషన్ అధికారులు మాత్రం రాకపోవడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



వీధులను పరిశీలిస్తున్న అధికారులు

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు లబ్ధి

సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై కలెక్టర్ నిశాంత్‌కుమార్


వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ

రాయచోటిటౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమయ్యే వ్యవసాయ పరికరాల కొనుగోలులో జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. సోమవారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై రాయచోటి పట్టణంలోని మాసాపేటలో గల వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యవసాయ, ఉద్యానవనశాఖలు సంయుక్తగా రైతులకు, ప్రజలకు అవగాహన కోసం ఎగ్జిబిషన్‌తో పాటు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న నూతన జీఎస్టీ విధానం వల్ల రైతులకు అవసరమయ్యే ట్రాక్టర్లు, డ్రిప్పులు, స్ప్రింక్లర్లపైన ఐదు శాతం జీఎస్టీ మాత్రమే ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు బోనమల ఖాదర్‌వలి, రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు గుర్రం సుబ్బయ్యానాయుడు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి శివనారాయణ, ఉద్యానవన శాఖ, వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది, పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కారు, ద్విచక్ర వాహనం ఢీ : రైతు మృతి


కారు,ద్విచక్రవాహనం ఢీకొన్న దృశ్యం, మృతి చెందిన రఘునాథరెడ్డి

కురబలకోట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-మదనపల్లె ప్రధాన జాతీయ రహదారిలోని దొమ్మన్నబావి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. దీనికి సంబంధించి స్థానిక పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎర్రబల్లి పంచాయతీ తూగువారిపల్లెకు చెందిన రఘునాథరెడ్డి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఆయన సొంత పనుల నిమిత్తం అంగళ్లకు తన ద్విచక్రవాహనంలో వెళుతుండగా దొమ్మన్నబావి వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

కాగా ఈ ప్రమాదంలో మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారు. సంఘటనా స్థలానికి ముదివేడు ఎస్సై దిలీప్‌కుమార్ చేరుకుని విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ టీడీపీ కార్యకర్త మృతి


వెంకటేశ్వర్లు (ఫైల్)

రాయచోటి టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన టీడీపీ కార్యకర్త దేరంగుల వెంకటేశ్వర్లు (32) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు పెమ్మాడపల్లి పంచాయతీ గరుగుపల్లికి చెందిన వెంకటేశ్వర్లు శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళుతుండగా రాయచోటి పట్టణ పరిధిలోని ఇనాయత్‌ఖాన్ చెరువు వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది.

దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని బెంగళూరుకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఇతనికి భార్య, ప్రణీత్, మోక్షిత్ అనే కుమారులు ఉన్నారు. ఈయన ఐటీడీపీ కన్వీనర్‌గా కూడా పనిచేశాడు. దీంతో టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్ బాబు రాయచోటి ఏరియా ఆసుపత్రిలో మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విద్యార్థిపై దాడి కేసులో విచారణ

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడు కొట్టడంతో విద్యార్థి చూపు కోల్పోయిన సంఘటనపై సోమవారం మదనపల్లె పోలీసులు విచారణ చేశారు. వివరాలిలా ఉన్నాయి. తంబళ్లపల్లి నియోజకవర్గం బి.కొత్తకోట సమీపంలోని గట్టు గ్రామ పంచాయతీ గట్టు వద్ద ఏర్పాటైన రిషి వాటిక గురుకుల పాఠశాలలో మండలంలోని కాలాడివాండ్లపల్లెకు చెందిన శేషాద్రిరెడ్డి చదువుకునేవాడు.

గత నెలలో ఉపాధ్యాయుడు కొట్టడంతో ఆ విద్యార్థి కంటి చూపు కోల్పోయాడు. ఇందుకు సంబంధించి విద్యార్థి సొంత ఊరైన కాలాడివాండ్లపల్లె వచ్చిన పోలీసులు తల్లిదండ్రులను విచారణ చేశారు. తమకు న్యాయం చేయాలని విద్యార్థి తల్లిదండ్రులు ఈ సందర్భంగా పోలీసులను కోరారు.

అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం..

- చెక్‌డ్యాంలు కొట్టుకుపోయి ఏళ్లు
- అయినా మరమ్మతులకు నోచుకోని వైనం
- 'కూటమి'లోనైనా మరమ్మతు పనులు జరిగేనా


కుమ్మరవాని ఒడ్డు పూర్తిగా కొట్టుకుపోయిన దృశ్యం

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలోనే అత్యంత వెనుకబడిన మండలం పెద్దతిప్పసముద్రం. ఈ మండలంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన చెరువులుగా కందుకూరు వ్యాసరాయసముద్రం, పీటీఎం తిప్పరాయసముద్రం, రంగసముద్రం రంగరాయ చెరువులు ఉన్నాయి. ఎగువ ప్రాంతంలో కురిసే వర్షాలకు నీరు చెరువులకు చేరి నిండి మొరవ ప్రవహిస్తే దిగువ ప్రాంతాలకు నీరు వృథాగా వెళ్తాయి. ఈ నీటిని నిలువ చేసి ఆ నీటితో మెట్ట ప్రాంత రైతులు పంటలను పండించుకునేందుకు వీలుగా గతంలో వాగులు వంకలపై చెక్‌డ్యాం నిర్మాణాలు చేపట్టి ఆయకట్టు రైతులు పంటలను సాగు చేసుకునే వారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన 2021-22లో ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురవడంతో మండలంలోని ప్రధాన చెరువులు నిండి భారీగా నీటి ప్రవాహం రావడంతో దిగువ ప్రాంతంలో నిర్మించిన చెక్‌డ్యాంలు పూర్తిగా కొట్టుకుపోయాయి.

కొట్టుకుపోయి మూడేళ్లు..

పెద్దతిప్పసముద్రం మండలంలోని బూర్లపల్లె గ్రామం కొత్తపల్లె సమీపంలో గత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తంబళ్లపల్లె నియోజకవర్గం అప్పటి ఎమ్మెల్యే కలిచెర్ల ప్రభాకర్‌రెడ్డి చెక్ డ్యాంకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి భారీ స్థాయిలో చెక్ నిర్మించడంతో కొత్తపల్లె, శ్రీనివాసరాయునిపల్లె, మడుమూరు గ్రామాలకు చెందిన సుమారు 300 ఎకరాల ఆయకట్టు భూమికి నీళ్లు అంది పంటలను పండించుకునేవారు. కొన్ని రోజులకు పీటీఎం చెరువుకు భారీగా వరద రావడంతో కొట్టుకుపోయింది. తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వంలో తిరిగి మరమ్మతులు చేయడంతో ఈ గ్రామాల రైతులు మళ్లీ పంటలను సాగు చేశారు. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. 2021-22లో పీటీఎం మండలంలో భారీగా వర్షాలు కురవడం చెరువులు భారీగా మొరవలు పోవడంతో చెక్‌డ్యాం పూర్తిగా కొట్టుకుపోయింది. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఆయకట్టు రైతులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అతీగతీ లేదని ఆయకట్టు రైతులు వాపోతున్నారు.

చెక్‌డ్యాం వైపు కన్నెత్తిచూడని అధికారులు

పీటీఎం పెద్ద చెరువు మొరవ ద్వారా వెళ్లే మిగులు జలాలు అధిక శాతంగా నీరు వెళుతోందని ఈ నీటిని నిలువ ఉంచగలిగితే మూడు గ్రామాలకు చెందిన సుమారు 300 వందల మంది రైతులకు లాభం చేకూరుతుందని, కొత్తపల్లె, శ్రీనివాసరాయునిపల్లె, మడుమూరు గ్రామాలకు చెందిన ఆయకట్టు రైతులు తమ గోడును వెళ్లిబుచ్చుకుందామని రెవెన్యూ అధికారులను సంప్రదిస్తే ఇరిగేషన్ అధికారులను కలవాలని సలహాలు ఇస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇరిగేషన్ అధికారులకు తమ గోడును చెప్పుకుందామంటే ఇరిగేషన్ అధికారులు ఎక్కడ ఉంటారో, ఎప్పుడు వస్తారోనని రైతులు అంటున్నారు. ఈ చెక్ డ్యాం పూర్తిగా కొట్టుకుపోవడంతో నీరు వృథాగా దిగువ ప్రాంతాలకు వెళ్లిపోతుండడంతో ఈ గ్రామాల్లో నీరు అడుగంటి పోయి తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు.

రైతుల ఎదురుచూపు

గత వైసీపీ ప్రభుత్వంలో చెక్‌డ్యాంలు, కాలువలు, వాగులు, వంకలు భారీ వర్షాలకు పూర్తిగా ధ్వంసమైనా గత పాలకులు పట్టించుకోకపోవడంతో నీరు నిల్వ లేకుండా వచ్చిన నీరు వచ్చినట్లుగా వృథాగా దిగువ ప్రాంతాలకు వెళ్లిపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి రైతులకు గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వంలో వాగులు వంకలు, చెరువులు అనే తేడా లేకుండా ఇసుకను భారీ యంత్రాలతో తోడేయడంతో భూగర్భ జలాలు అడుగంటి గ్రామాల్లో కరువుఛాయలు అలుముకున్నాయి. కనీసం కూటమి ప్రభుత్వంలోనైనా ధ్వంసమైన చెక్ డ్యాంలను పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టి ఆయకట్టు రైతులను ఆదుకుంటారని ఎదురు చూస్తున్నారు.


ఒడ్డుకు అమర్చిన రాళ్లు భారీ వర్షాలకు కొట్టుకుపోయి దిగువ ప్రాంతాలకు చేరిన దృశ్యం


ముళ్లకంపలతో పూర్తిగా ముసుకుపోయిన కుమ్మరవాని ఒడ్డు ప్రాంతం

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం..

మండలంలోని బూర్లపల్లె పంచాయతీ కొత్తపల్లె, చల్లావాండ్లపల్లె, మడుమూరు, శ్రీనివాసరాయునిపల్లె, బొంతవారిపల్లె, రంగసముద్రం, తోటవారిపల్లె తదితర గ్రామాల్లో కొట్టుకుపోయిన సుమారు 10 చెక్ డ్యాంలను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే పనులను ప్రారంభించి చెక్‌డ్యాంల మరమ్మతు పనులు చేపడతాం.

- సతీష్‌గౌడ్, ఇరిగేషన్ జేఈ

పట్టాభిరాముడికి పవిత్రాల సమర్పణ

వాల్మీకిపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిరామాలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం టీటీడీ ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ మొదలుకుని ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో విశేషాలంకరణలు చేసి పూజలు నిర్వహించారు.

ఆలయ మండపంలో ఉన్న పవిత్రాలను టీటీడీ అధికారులతో కలిసి ప్రదక్షిణగా తీసుకువెళ్లి మూలవర్లకు, భోగోత్సవమూర్తులైన సీతారామలక్ష్మణులకు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం మొదలుకుని దేవతా మూర్తుల ప్రతిమలకు పవిత్రాలను సమర్పించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమాలలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ మునిబాల, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.


ధ్వజస్తంభం వద్ద పవిత్రాల సమర్పణ చేస్తున్న అర్చకులు

చెయ్యేటికి మళ్లీ వరద నీరు

- ధ్వంసమైన తాత్కాలిక రోడ్లు
- రాకపోకలకు తప్పని ఇబ్బందులు

పెనగలూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎగువ ప్రాంతాల్లో శని, ఆదివారాల్లో కురిసిన భారీ వర్షాల వల్ల ఆదివారం సాయంత్రం నుంచి చెయ్యేటికి భారీగా వరదనీరు వచ్చింది. వరదనీటి ప్రవాహంతో ఓబిలి-టంగుటూరు మధ్య ఉన్న మట్టిరోడ్డు, కోడిచెన్నయ్యగారిపల్లె, పల్లంపాడు మధ్యనున్న మరో మట్టి రోడ్డు కొట్టుకుపోయాయి. రెండు వారాల కిందట పింఛా ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయడంతో ఈ రెండు రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. స్థానిక నాయకులు ట్రాక్టర్లతో మట్టి రాళ్లు తోలి మరమ్మతులు చేస్తున్నారు. అయితే అకస్మాత్తుగా ఆదివారం సాయంత్రం వరద నీరు రావడంతో రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో సోమవారం ఉదయం నుంచి నాలుగు గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించిపోయాయి.


నీటి ఉధృతికి కొట్టుకుపోయిన ఓబిలి-టంగుటూరు మట్టి రోడ్డు

డ్రోన్ సాయంతో 17మంది జూదరుల అరెస్టు

- *17 సెల్‌ఫోన్స్, రూ.4.44 లక్షల నగదు స్వాధీనం*

మదనపల్లె అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ సాయంతో 17 మంది జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 17 సెల్‌ఫోన్లు, 10 ద్విచక్రవాహనాలతో పాటు రూ.4,44,050 నగదును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ మహేంద్ర తెలిపారు. మదనపల్లె నియోజకవర్గంలోని నిమ్మనపల్లె మండలం దిగువపల్లెలో జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సోమవారం నిమ్మనపల్లె పోలీసులు డ్రోన్ సాయంతో మెరుపుదాడులు జరిపి నిమ్మనపల్లె ఎస్ఐ తిప్పేస్వామి ఏడుగురు జూదరులను, ఏడు సెల్‌ఫోన్లు, రూ.20,850 నగదును స్వాధీనం చేసుకున్నారు.

అలాగే మదనపల్లె మండలం బండకాడపల్లె సమీపంలో పేకాట స్థావరాలపై మదనపల్లె తాలుకా సీఐ కళా వెంకటరణ దాడులు చేసి పది మంది జూదరులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4,23,200 నగదు, ఐదు మోటార్‌సైకిళ్లు, 12సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకోగా మరికొంత మంది పారిపోయారన్నారు. మదనపల్లెకు చెందిన అర్జున్‌రెడ్డి, రమేశ్ పేకాట స్థావరాలు నిర్వహిస్తున్నట్లు తెలిసిందని, వారు పరారీలో ఉన్నారని, వారిపై కేసు నమోదు చేశామని, త్వరలో అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు.


మదనపల్లె మండలం బండకాడపల్లెలో జూదరులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఎర్రచందనం కేసులో ఇద్దరి అరెస్ట్



వివరాలు తెలుపుతున్న అర్బన్ సీఐ వెంకటాచలపతి

రాయచోటి టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎర్ర చందనం అక్రమ రవాణా కేసులో తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి తిరుపతిలోని ఎర్రచందనం స్పెషల్ కోర్టుకు తరలించినట్లు రాయచోటి అర్బన్ సీఐ బీవీ చలపతి తెలిపారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. 2021 అక్టోబరులో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తుండగా పోలీసులు దాడి చేయడంతో కడప జిల్లా చెన్నూరు మండలం శ్రీరాంనగర్, కొక్కరాయపల్లెకు చెందిన కొలిమి సుభాన్‌బాషా, అర్జున్ పారిపోయారన్నారు. అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్న నిందితులు ఆదివారం సాయంత్రం రాయచోటి గాలివీడు రింగురోడ్డు వద్ద వాహనాలు తనిఖీలో తాను, ఎస్ఐ బాలకృష్ణ సిబ్బందితో కలిసి అరెస్టు చేసినట్లు తెలియజేశారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేసిన అనంతరం కోర్టుకు తరలించినట్లు వివరించారు.

అంతర్రాష్ట్ర బైక్ దొంగ అరెస్టు


దొంగ అరెస్టు చూపుతున్న మదనపల్లె డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అంతరాష్ట్ర బైక్ దొంగను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర తెలిపారు. సోమవారం మదనపల్లె తాలుకా పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నిందితుడి అరెస్టు వివరాలను వెల్లడించారు. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం చంద్రమాకులపల్లెకు చెందిన పులి వెంకటరెడ్డి (33) అన్నమయ్య, బాలాజీ జిల్లా, కర్ణాటకలోని కోలారు జిల్లాల్లో 45 మోటార్ సైకిళ్ల దొంగతనం చేసి పోలీసులకు పట్టుబడ్డాడని తెలిపారు. ఇతడి వద్ద నుంచి రూ.13,50,000 విలువ చేసే వివిధ రకాల 25 బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని, ఇంకా 20 మోటార్ సైకిళ్లు ఉన్నాయని, వాటిని ట్రేసౌట్ చేస్తున్నట్లు తెలిపారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ, ఎస్ఐ చంద్రమోహన్ తమ సిబ్బంది కలిసి మదనపల్లె మండలం చుట్టుపక్కల ప్రాంతాల్లో, మండలాల్లో జరుగుతున్న మోటార్ సైకిళ్లపై నిఘా ఉంచారన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీ మదనపల్లె-పుంగనూరు రోడ్డు ఆంజనేయస్వామి ఆలయం వద్ద పులి వెంకటరెడ్డిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు.

16న జిల్లాలో మందకృష్ణ పర్యటన


సమావేశంలో మాట్లాడుతున్న డానియల్

పీలేరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 16న జరగనున్న మందకృష్ణ మాదిగ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ కోట డానియల్ పిలుపునిచ్చారు. పీలేరులోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో సోమవారం ఆయన నియోజకవర్గ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, వీహెచ్‌పీఎస్ కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరుగకుండా ఉద్యమాలు చేసిన మందకృష్ణకు జిల్లాలో ఘనంగా స్వాగత ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయన కేవలం మాదిగల రిజర్వేషన్‌ల కోసమే కాకుండా రోగులకు ఆరోగ్యశ్రీ, ప్రత్యేక ప్రతిభావంతులకు పింఛన్లు సాధించిన ఘనత కూడా ఆయనదేనన్నారు. కార్యక్రమంలో నాయకులు రవీంద్ర, గండికోట వెంకటేశ్, రామమోహన్ రెడ్డి, వెంకటేశ్, అమరనాథరెడ్డి, రెడ్డప్ప, రాము, రాజేశ్, హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

పనులు సరే...బిల్లులేవీ?

- వామ్మో మేము పనులు చేయలేము...
- చేసిన పనులకు బిల్లులు రాక..
- కాంట్రాక్టర్ల ఎదురుచూపులు

రైల్వేకోడూరు రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది ఇక కాంట్రాక్ట్ పనులను విచ్చలవిడిగా చేసేద్దాం అన్న కూటమి నేతలు ఇప్పుడు వామ్మో మేము పనులు చేయలేము అనే పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనుల కాంట్రాక్ట్ బిల్లులు చెల్లింపులకు సంబంధించిన సమస్యలు పరిష్కారమవుతాయని చాలామంది ఆశించారు. అయితే వారి ఆశలు అడియాశలయ్యాయి. ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఒకటిన్నర సంవత్సరం పూర్తవుతున్నప్పటికీ కాంట్రాక్టర్లకు చాలామందికి ఇంకా బిల్లులు అందకపోవడంతో వారు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కూటమి నేతలు పంచాయతీలకు మంజూరైన నిధులతో చిన్నపాటి సమస్యలను పరిష్కరించుకున్నప్పటికీ ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద చేసిన పనులకు సంబంధించిన నిధులు ఇంతవరకు విడుదల కాలేదు. నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు రూ.16 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టారు. అయితే ఈ పనులకు సంబంధించిన నిధులలో కేవలం 40 శాతం మాత్రమే ఇప్పటివరకు అందాయి. మిగిలిన 60 శాతం నిధులు ఎప్పుడు వస్తాయో తెలియక కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి పనులు చేపట్టిన నేతలు ఇప్పుడు వడ్డీలు కట్టుకుంటూ లబోదిబోమంటున్నారు. కోడూరు మండలంలోని ప్రధానమైన రెడ్డివారిపల్లి వంతెన పనులు దాదాపు 80 శాతం పూర్తయ్యాయి. అయినప్పటికీ ఇప్పటివరకు కనీసం ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల కాలేదు. నిధులు ఎప్పుడు వస్తాయో అర్థం కాక కూటమి నేతలు పనులు చేయడానికి భయపడుతున్నారు.

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు పనులను మొదలుపెట్టాలని ప్రయత్నించనప్పటికీ నిధులు వస్తాయో రావో అనే అయోమయంలో ప్రతినిధులు ఉన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలోపు గ్రామాలలో ప్రధానమైన రోడ్ల పనులను చేపట్టాలని లేని పక్షంలో ఎన్నికలకు వెళ్లే పరిస్థితి ఉండదని నేతలు భయపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బిల్లుల చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేయాలని స్థానిక నేతలు, కాంట్రాక్టర్లు కోరుతున్నారు.


80 శాతం పూర్తయిన రెడ్డివారిపల్లె వంతెన పనులు


ఒక్క రూపాయి రాలేదు..

- బ్రిడ్జి నిర్మిస్తున్న ఓ కాంట్రాక్టరు

బ్రిడ్జి పనులను 80 శాతం పనులను పూర్తి చేయడం కోసం ఇప్పటికే రూ.10 కోట్లు ఖర్చు చేశాను, ఇప్పటి వరకు కనీసం ఒక రూపాయి రాలేదు. బ్రిడ్జి నిర్మాణంలో వేసిన తాత్కాలిక బ్రిడ్జి అనేకసార్లు వరదలు వచ్చి కొట్టుకుపోయినా అదనపు ఖర్చు చేసి మరలా నిర్మించాను. బ్రిడ్జి నిర్మాణంలో భూమి కోల్పోయిన నిర్వాసితులకు పరిహారం అందకపోవడంతో వారు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నారు. దీంతో బ్రిడ్జి నిర్మాణం పనుల్లో జాప్యం జరిగింది. త్వరితగతిన బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని లేని పక్షంలో నిధులకు ఆటంకం కలుగుతుందని అధికారులు చెబుతున్నారు. వడ్డీలు భారీగా పెరిగిపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్‌ల బాధలను అర్థం చేసుకుని నిధులు విడుదల చేయాలి.

ఎత్తిపో(కో)తలేనా...!

- అర్ధాంతరంగా ఆగిపోయిన వరికుంట్ల చెరువు ఎత్తిపోతల పథకం
- ప్రసంగాలకే పరిమితమైన వైసీపీ నాయకుల హామీలు
- కూటమి ప్రభుత్వంలోనైనా పనులు ముందుకు సాగేనా



గంగనపల్లె తెలుగుగంగ కాలువ వద్ద అసంపూర్తిగా ఉన్న సంప్ నిర్మాణం



నిరుపయోగంగా ఉన్న పైపులు

కాశినాయన, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) మండలంలోని తెలుగంగ కాలువ పడమరవైపున ఉన్న గ్రామాల ప్రజలు సాగు, తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో తెలుగంగ ఎడమ కాలువ ప్రహిస్తున్నప్పటికీ దాదాపు 70 శాతం సాగుభూమికి తెలుగంగ జలాలు అందని పరిస్థితి. ఇటుకులపాడు నుంచి గంగనపల్లె వరకు దాదాపు 9 గ్రామాల ప్రజలు తెలుగంగ జలాలకోసం దశాబ్దాల తరబడి ఎదురుచూపులు చూస్తున్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి రాజకీయ నాయకులు ఎత్తిపోతల ద్వారా తెలుగంగ నీరు ఇటుకులపాడు, సావిశెట్టిపల్లె, వరికుంట్ల, బాలాయపల్లె తదితర గ్రామాల్లోని చెరువులకు, కుంటలకు నీరు అందిస్తామని హామీ ఇస్తున్నా అది నేటికీ కార్యరూపం దాల్చలేదు.

మండలంలోని ఇటుకులపాడు వద్ద 2014-2019 సంవత్సరాలలో టీడీపీ అధికారంలో ఉండగా తెలుగంగ కాలువపై ఎత్తిపోతలకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇటుకులపాడు చెరువు నుంచి సావిశెట్టిపల్లె, వరికుంట్ల, బాలాయపల్లె తదితర చెరువులకు లింక్ చానల్ ద్వారా నీరు నింపాలని నిర్ణయించారు. అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారులు పలుమార్లు పర్యటించి నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. ఇంతలో ఎన్నికలు రావడం టీడీపీ అధికారం కోల్పోయి వైసీపీ అధికారంలోకి వచ్చింది. అయితే అనంతరం అధికారం చేపట్టిన వైసీపీ నాయకులు ఎత్తిపోతల పథకంపై దృష్టి పెట్టలేదు. ఈప్రాంత ప్రజలు ఎత్తిపోతలపై ఎంత మొత్తుకున్నా పట్టించుకున్న పాపానపోలేదు. తీరా ఎన్నికలు సమీ పిస్తున్న తరుణంలో మండల వాసి వైసీపీ ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డిపై ఒత్తిడి పెరిగింది. దీంతో పాత ప్రతిపాదనలు పక్కనబెట్టి కొత్తగా రూ.13కోట్లతో టెండరు ఖరారు చేసి వరికుంట్ల చెరువుకు నీరందించేందుకు ఎత్తిపోతల పథకానికి ఎన్నికలకు 3 నెలల ముందు కడప ఎంపీ అవినాష్‌రెడ్డితో కలిసి ఆగమేఘాలమీదల భూమిపూజ చేశారు. కోడ్ రాకముందే మాప్రభుత్వం అధికారంలో ఉండగానే ఎత్తిపోతల పథకం ప్రారంభించి ఓట్లు అడుగతామంటూ ప్రసంగించారు. కానీ ప్రజలు ఊహించినట్లే జరిగింది. గడువులోగా ఎత్తిపోతల పనులు పూర్తిగా లేదు. దాదాపు 90 శాతం పైప్‌లైన్ పనులు చేశారు గానీ సంప్ నిర్మాణం, మోటార్ల ఏర్పాటు, కరెంట్ సౌకర్యం తదితర కీలకమైన పనులు అర్ధాంతరంగా నిలిచిపో యాయి. అనంతరం వచ్చిన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటిపోయినా కాంట్రాక్టర్ పనులు తిరిగి ప్రారంభించ లేదు. ఇటీవల సావిశెట్టిపల్లె చెరువుకు ఎత్తిపోతల ద్వారా నీరందించే పథకానికి భూమిపూజకు వచ్చిన బద్వేల్ టీడీపీ ఇంచార్జి రితీష్‌రెడ్డి గంగనపల్లె వద్ద అర్ధాంతరంగా ఆగిని ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయించి వరికుంట్ల చెరువుకు నీరందిస్తామని ప్రకటించారు. అయితే పనులు మొదలు పెట్టకపోవడంతో ఈప్రభుత్వంలోనైనా వరికుంట్ల చెరువుకు ఎత్తిపోతల ద్వారా నీళ్లు అందుతాయే లేదోనని ప్రజల్లో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈవిషయంపై సంబంధిత అధికారిని వివరణ కోరగా దాదాపు రూ.11 కోట్లకు పనులు జరిగాయని, కాంట్రా క్టర్‌కు దాదాపు రూ.9 కోట్ల బిల్లులు రావాల్సి ఉందన్నారు. బిల్లులు అందగానే మిగిలిన పనులు పూర్తి చేయిస్తామన్నారు.

రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చింది వైసీపీనే

- ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చిందని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన తన ఇంటి వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని తంబళ్లపల్లె నియోజకవర్గం ములకల చెరువు వద్ద టీడీపీకి చెందిన ఒకరిద్దరు నకిలీ మద్యాన్ని తయారు చేస్తు న్న విషయం బయటకు పొక్కిందన్నారు. వెంటనే అధిష్టానం అప్రమత్తమై వారిపై చర్యలు తీసుకుందన్నారు. ఆ నియోజకవర్గంలో నకిలీ మద్యం తయారవుతోందంటే అంతో ఇంతో ఆ నియోజకవర్గ నాయకులకు తెలిసే ఉంటుందని, ఆ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి, సురేంద్రలను కూడా పార్టీ నుంచి సస్పెండ్ చేసిందన్నారు. ఇలాంటి వ్యవహారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు క్షమించరన్నారు. దీనిపై ఇంకా లోతైన దర్యాప్తు జరపాలని ఆ జిల్లాకు సంబంధం లేని వారిని నియమించి విజిలెన్స్ దర్యాప్తు చేయిస్తున్నారన్నారు. కానీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గోరంతను కొండంత చేసి రాష్ట్రంలో నకిలీ మద్యం తెచ్చి వేలకోట్ల రూపాయలను దోచుకుంటున్నారని రాద్ధాంతం చేస్తున్నారన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చి వేల కోట్ల రూపాయలను దోచుకున్నారన్నారు. ఇష్టమొచ్చిన బ్రాండ్లను తెచ్చి దాదాపు 35 లక్షల మంది ఆరోగ్యాలతో ఆడుకున్నారన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



రామ్మోహన్ మృతదేహం

కడప క్రైం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కడప నగరం వినాయక్‌నగర్ సర్కిల్ సమీపంలో సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామ్మోహన్ (39) అనే వ్యక్తి మృతి చెందాడు. కడప ట్రాఫిక్ సీఐ జావీద్ తన సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సీఐ వివరాల మేరకు.. వల్లూరు మండలం బీచువారిపల్లెకు చెందిన రామ్మోహన్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 14 ఏళ్ల క్రితం ఆయనకు వివాహం కాగా, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. సోమవారం ఉదయం 11.30గంటలకు ఇంటి నుంచి కడపకు ద్విచక్ర వాహనంలో బయల్దేరాడు. వినాయకనగర్ జంక్షన్ వద్దకు సమీపంలోకి రాగానే ఆగి ఉన్న బస్సును ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించి మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

బైకు కారు ఢీ....ఇద్దరికి గాయాలు

రైల్వేకోడూరు రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బైకు కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు..పోలీసులు అందించిన సమాచారం మేరకు మండలంలోని అనంతరాజుపేట పంచాయతీలోని కట్టపుట్టాలమ్మ గుడి సమీపంలో తిరుపతి వైపు వెళ్తున్న కారు, కడప వైపు వెళ్తున్న మోటార్ బైకును ఢీకొంది. దీంతో బైకుపై వెళ్తున్న ఓబులవారిపల్లి మండలం బొమ్మవరం గ్రామానికి చెందిన శంకర, రాజంపేటకు చెందిన వెంకట రమణ గాయపడ్డారు. స్థానికులు 108 వాహనంలో వారిని కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ప్రాథమిక చికిత్స అనంతరం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీప్రసాద్ రెడ్డి తెలిపారు.

కారు ఢీకొని ఇద్దరికి...

బద్వేలుటౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బయనపల్లె వద్ద సోమవారం సాయంత్రం కారు ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. భావనారాయ నగర్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మనోహర్‌రెడ్డి విధులు ముగించుకొని తండ్రి సూర్యప్రకాష్‌రెడ్డితో కలిసి ద్విచక్ర వాహనంలో స్వగ్రామం సోమేశ్వరం గ్రామానికి బయలుదేరాడు. బయనపల్లె వద్దకు రాగానే కారు ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తీసుకువెళ్లారు.

వర్షానికి కూలిన మట్టిమిద్దె

వీరపునాయునిపల్లె, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వీరపునాయునిపల్లెలోని ఎర్రంపల్లె రహదారిలో ఉన్న నర్రావుల భాస్కర్‌రెడ్డికి చెందిన మట్టిమిద్దె కూలిపోయింది. సోమవారం తెల్లవారుజాము 4గంటల ప్రాంతంలో కురిసిన వర్షంతో ఉదయం 8గంటల ప్రాంతంలో కూలిపోయింది. ఇంటిలో కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఇంట్లోని సామగ్రి అంతా పనికిరాకుండా పోయిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

శాశ్వత పరిష్కారం చూపాకే పనులు

- టెయిలింగ్‌పాండ్ వద్ద కేకే కొట్టాల ప్రజల ఆందోళన



యూసీఐఎల్ టెయిలింగ్‌పాండ్ వద్ద కేకే కొట్టాల ప్రజల నిరసన

పులివెందుల/వేముల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మా గ్రామానికి శాశ్వత పరిష్కారం చూపాలని.. లేదంటే టెయిలింగ్‌పాండ్ విస్తరణ పనులు సాగనివ్వమని కేకే కొట్టాల గ్రామ ప్రజలు తేల్చి చెప్పారు. సోమవారం టెయిలింగ్‌పాండ్‌కు వెళ్లే దారిలో బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదారేళ్లుగా టెయిలింగ్ పాండ్‌తో అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఎన్నిమార్లు యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (యూసీఐఎల్) వారికి విన్నవించినా పట్టించుకోలేదన్నారు. 2018, 2021 రెండు దఫాలుగా టెయిలింగ్‌పాండ్ విస్తరణ పనులు చేపట్టారన్నారు. ఆ సమయంలో తీవ్ర నిరసనలు వ్యక్తం చేసినప్పటికీ అప్పటికి హామీలు ఇచ్చి.. వారి పబ్బం గడుపుకున్నారన్నారు. 2018లో జిల్లా కలెక్టర్ హరికిరణ్ ఏడాదిన్నరలోపు మీ సమస్యలు తీరుస్తామని హామీ ఇచ్చినా.. ఇప్పటికీ అమలు కాలేదన్నారు. టెయిలింగ్ పాండ్ కారణంగా భూగర్భ జలాలు కలుషితవుతున్నాయన్నారు. దీంతో తాగునీటికి, సాగునీటికి ఇబ్బందిగా మారిందన్నారు. పంటల సాగుకు వినియోగిస్తున్న బోరు బావుల్లో యురేనియం వ్యర్థాలు కలుస్తూ అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మా గ్రామాన్ని పూర్తిగా యూసీఐఎల్ స్వాధీనం చేసుకొని.. ప్రజలంద రినీ వేరేచోటకు పంపించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

గండికోట ముంపు బాధితులకు న్యాయమైన పరిహారం

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

కడప కలెక్టరేట్/ కొండాపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గండికోట ముంపు నిర్వాసితులకు పునరావాసం కల్పించడంతో పాటు న్యాయమైన పరిహారం అందేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో గండికోట జలాశయ ముంపు వాసులకు పునరావాసం, పరిహారం, మౌలిక సదుపాయాలు కల్పి ంచే అంశమై కలెక్టర్‌తో పాటు జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, జేసీ అదితిసింగ్, ఆర్డీవో సాయిశ్రీ, ఎస్డీసీలు శాంతమ్మ, నీలమయ్యలతో కలసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గండికోట రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేసి జిల్లాను సస్యశ్యామలం చేసిందన్నారు. నీటి నిల్వ సామర్థ్యం పెంపు విషయంలో మరికొన్ని గ్రామాలు ముంపునకు గురికావడంతో ఆయా గ్రామస్థులకు కూడా పరిహారం, పునరావాసం కల్పించడం జరిగిందన్నారు. అందుకు సంబంధించి నివాస గృహాలను, లబ్ధిదారులకు వారి పేరుతో ధ్రువీకరణ రిజిస్ట్రేషన్ చేయించి అందించేందుకు తక్షణం చర్యలు చేపడతామన్నారు. కొండాపురం మండలంలో 3 గ్రామాలకు పరిహారం అందాల్సి ఉందన్నారు. మొత్తం 22 గ్రామాల వరకు ముంపునకు గురయ్యాయని, వారందరికీ పరిహారం, పునరావాసం కూడా కల్పించినట్లు తెలిపారు. అలాగే 26 గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించామని, పునరావాసం కల్పించే విషయంలో కొన్ని అంశాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ప్రకారం అందాల్సిన పరిహారం, నిధులు, పునరావాస కల్పనలో భాగంగా మౌలిక సదుపాయాలు కల్పించడంలో పూర్తి స్థాయిలో పనులు చే పట్టాల్సి ఉందన్నారు. సామాజిక ఆర్థిక సర్వే విషయంలో కూడా పూర్తిస్థాయి వివరాలు అందాల్సి ఉందన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ గండికోట రిజర్వాయర్ కోసం భూములు, ఇళ్లను కోల్పోయిన నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. పునరావాస కాలనీల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అనంతరం ముంపు గ్రామాలకు సంబంధించిన సమస్యలపై నిర్వాశితుల నుంచి కలెక్టర్, ఎమ్మెల్యేలు అర్జీలు స్వీకరించారు.

ఈ సందర్భంగా గండికోట నిర్వాసితులు పునరావాసం కింద నిర్మించుకున్న ఇళ్లకు ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని, హౌసింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. ముంపునకు గురైన తర్వాత కొన్ని పంచాయతీలు పునర్విభజన కాలేదని, వాటిని పునర్విభజన చేయాలన్నారు. కొండాపురం పట్టణంలో ముంపునకు గురైన హైస్కూల్, కాలేజి స్థానంలో వెంటనే కొత్త స్కూల్, కాలేజీని ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా ముంపునకు గురైన ప్రభుత్వ ఆఫీసుల స్థానంలో కొత్త ఆఫీసులను నిర్మించాలని కోరారు. కొన్ని కాలనీల్లో శ్మశానవాటికలు, రోడ్లు , డ్రైనేజీలు లేవని, వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు కలెక్టర్, తమ పరిధిలో వాటిని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని, మిగిలిన వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్డీవో ఆదిమూలం సాయిశ్రీ, ఇతర శాఖల అధికారులు, గండికోట నిర్వాసితులు పాల్గొన్నారు.

డీకేటి భూముల కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

- ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎదురూరు బాబు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

కడప మారుతీనగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దళితులు, మైనార్టీలకు ఇచ్చిన డీకేటి భూములను కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎదురూరు బాబు డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీకేదిన్నె మండలం ఇప్పెంట పంచాయతీ పరిధిలోని కాంపల్లె, ఇప్పెం ట గ్రామాల్లో మాదిగలు, మైనార్టీలకు సంబంధిత గ్రామ రెవెన్యూ పొలంలో 1999 సంవత్సరంలో సర్వే నెం.274లో 28 ఎకరాల భూమిని 22 మంది మాదిగలకు, మైనార్టీలకు 0-75 సెంట్ల డీకేటి భూమిని నాటి ప్రభుత్వం పట్టాలుగా ఇచ్చిందన్నారు. ఆ భూములకు సంబంధిత మండల రెవెన్యూ అధికారులు సర్వే చేయకపోగా హద్దులు కూడా ఏర్పాటు చేయలేదన్నారు. ఆ భూముల్లో పంటలు వేస్తూ వ్యవసాయం చేస్తుంటే కొంత మంది బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఆ భూమిని వారే కొన్నట్లుగా దళితులను, మైనార్టీలను భయభ్రాంతలకు గురి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి డీకేటి భూమిని వారికి చెందేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆర్ఎన్ రాజా, మాత య్య, ఎంసీపీ నాయకులు రెడ్డయ్య, సుబ్బరాయుడు, పీఎస్‌యు నాయకులు గోపీ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహర్షి వాల్మీకి జయంతి

కడప కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమం మంగళవారం 10-10 గంటలకు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9-30 గంటలకు ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న వాల్మీకి విగ్రహానికి పూలమాలలతో అలంకరణ కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లా అధికారులు, అనధికారులు, బీసీ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

రాంగ్ రూటులో వచ్చి.. లారీని ఢీకొన్న కారు

- బ్రేక్ వేయడంతో లారీ వెనుక నాలుగు వాహనాలు ఢీ



ప్రమాదంలో లారీల మధ్యలో పాక్షికంగా దెబ్బతిన్న కార్లు

పుల్లంపేట, అక్టో బరు 6 (ఆంధ్రజ్యోతి) : ముగ్గురు యువకులు మద్యం తాగి కారులో రాంగ్ రూటులో వచ్చి లారీని ఢీకొనడంతో.. లారీ వెనుకవైపున నాలుగు వాహనాలు వరుసగా ఒకదానినొకటి ఢీకొన్నాయి. టిప్పర్ డ్రైవర్ సమయస్ఫూర్తితో రెండు కార్లలో ఉన్న 10 మంది ప్రమాదం నుంచి బయటపడ్డారు. సోమవారం రాత్రి ముగ్గురు యువకులు మద్యం తాగి కారులో రాజంపేట నుంచి రైల్వేకోడూరు వైపు రాంగ్ సైడ్‌లో వెళుతూ ఉడుమువారిపల్లె సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నారు. ప్రమాదాన్ని కొద్ది క్షణాలు ముందుగానే పసిగట్టిన లారీ డ్రైవర్ బ్రేక్ వేయడంతో కారు పాక్షికంగా దెబ్బతింది. కాగా ఈ లారీ వెనుకవైపు మరో లారీతో పాటు రెండు కార్లు వస్తున్నాయి. వాటి వెనకే ముగ్గురాయితో మంగంపేట నుంచి కడపకు వెళుతున్న టిప్పర్ డ్రైవర్ ప్రమాదాన్ని పసిగట్టి పక్కకు తిప్పడంతో కారు వెనుక వైపు సైడ్ ఢీకొంది. దీంతో రెండు కార్లలో ఉన్న 15 మంది సురక్షితంగా బయటపడ్డారు. టిప్పర్ డ్రైవర్ సమయస్ఫూర్తితో రెండు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అయితే, ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాల కాలేదు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేసి మద్యం మత్తులో ఉన్న యువకులను పోలీసుస్టేషన్‌కు తరలించారు.

ఆదర్శం.. ఆ గురుకులం

- గుండ్లకుంట పాఠశాలకు స్వచ్ఛాంధ్ర పురస్కారం
- పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థుల హర్షం



గురుకుల పాఠశాల ప్రధాన భవనం

జమ్మలమడుగు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పెద్దముడియం మండలం గుండ్లకుంట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల రాష్ట్రస్థాయి స్వచ్ఛాంధ్ర పురస్కారానికి ఎంపి కైంది. రాష్ట్రంలో స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రకటనలో భాగంగా రెసిడెన్షియల్ స్కూలు విభాగంలో గుండ్లకుంట గ్రామంలోని గురుకుల పాఠశాలకు స్థానం దక్కింది.

గుండ్లకుంట గ్రామంలోని గురుకుల పాఠశాల సుమారు పది ఎకరాల సువిశాల విస్తీర్ణం ఉంది. అన్ని రకాల వసతులతో ఏర్పాటు చేసిన భవన సముదాయం, పాఠశాల ఆవరణలో మొక్కల పెంపకం ఎంతో అందంగా ఆహ్లాదంగా కనిపిస్తుంది. ఇటీవల జిల్లా స్థాయి అధికారుల బృందం ఆదర్శ పాఠశాలల ఎంపికలో భాగంగా పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కల పెంపకం, పరిశుభ్రత, బాత్‌రూం నిర్వ హణ, వంట గదుల శుభ్ర త ఇలా అన్ని రకాలుగా పరిశీలించారు. అలాగే విద్యార్థుల్లో స్వచ్ఛ భారత్, స్వచ్ఛాం ధ్ర పట్ల అవగాహన గురించి ఆరా తీశారు. విద్యార్థులు బసచేసే వసతి సము దాయా లన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు చేతుల పరి శుభ్రత, పరిసరాల పరిశుభ్రత తదితర వాటిపై అన్ని రకాలుగా బృందం పరిశీలించి తగు నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. ఈ క్రమంలో పాఠశాలకు రాష్ట్రస్థాయిలో అవార్డు రావడం గమనార్హం. మొత్తమ్మీద గుండ్లకుంట గురుకుల పాఠశాల రాష్ట్రస్థాయి స్వచ్ఛ అవార్డు ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపాల్ ఎం.సుజాత, ఉపాధ్యాయులు, సిబ్బందితో పాటు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





పాఠశాల ఆవరణలో అందంగా కనిపిస్తున్న సిమెంటురోడ్డు, మొక్కలు నాటుతున్న విద్యార్థినులు

కలెక్టర్ నిశాంత్‌కుమార్ చేతులమీదుగా స్వచ్ఛఆంధ్ర-స్వర్ణఆంధ్ర అవార్డును అందుకుంటున్న డాక్టర్ రమేశ్‌బాబు



నిమ్మనపల్లి పీహెచ్‌సీకి స్వచ్ఛఆంధ్ర-స్వర్ణఆంధ్ర అవార్డు

నిమ్మనపల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి స్వచ్ఛఆంధ్ర-స్వర్ణఆంధ్ర అవార్డుకు ఎంపిక అయింది. సోమవారం రాయచోటిలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్ చేతుల మీదుగా వైద్యాధికారి రమేశ్‌బాబు ఈ అవార్డును అందుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డుకు జిల్లాలో ఏడు ప్రభుత్వ ఆసుపత్రులు ఎంపిక కాగా అందులో నిమ్మనపల్లికి మొదటి స్థానం లభించినట్లు తెలిపారు. అలాగే ఆసుపత్రిలో పరిసరాల పరిసుభ్రత పాటిండంతో పాటు డాక్టర్లు అందుబాలులో వుండి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవార్డు రావడానికి కృషి చేసిన సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ అవార్డుతో రావడంతో మరింత కృషి పట్టుదలతో పని చేస్తామని ఆయన తెలిపారు.

పీలేరుకు నాలుగు అవార్డులు





కలెక్టరు చేతుల మీదుగా అవార్డులను అందుకుంటున్న పీలేరు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, అంగన్‌వాడీ కార్యకర్త రోజారాణి

పీలేరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జిల్లా స్థాయి స్వచ్ఛ ఆంధ్ర-2025 అవార్డులను సోమవారం పీలేరు అధికారులు అందుకున్నారు. రాయచోటిలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఆసుపత్రి అవార్డును పీలేరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్, స్వచ్ఛ అంగన్‌వాడీ కేంద్రం అవార్డును కామాటంవారిపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త రోజారాణి, స్వచ్ఛ వీవో అవార్డును ముడుపులవేముల వీవో తరపున పీలేరు ఏపీఎం జవహర్ బాషా, స్వచ్ఛ పాఠశాల అవార్డును పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రేమరాణి అందుకున్నారు.

కురవంకకు ఉత్తమ పంచాయతీ అవార్డు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురవంక గ్రామ పంచాయతీకి స్వచ్ఛఆంధ్ర-స్వర్ణాంధ్ర అవార్డు దక్కింది. సోమవారం ఈ అవార్డును కలెక్టర్ నిశాంత్‌కుమార్ చేతుల మీదుగా కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి అందున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ చలపతి మాట్లాడుతూ గ్రామంలో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను అందించనున్నట్లు తెలిపారు. పంచాయతీ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. ఉత్తమ స్వచ్ఛత గ్రీన్ అంబాసిడర్‌గా కురవంక పంచాయతీ వర్కర్ సురేశ్‌కు దక్కిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ మంజుల పాల్గొన్నారు.



అవార్డు అందుకొంటున్న చిప్పిలి సర్పంచ్ చలపతి

బి.కొత్తకోటలో భారీ వర్షం

బి.కొత్తకోట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం రాత్రి భారీవర్షం కురిసింది. మండలంలోని గుమ్మసముద్రం, గట్టు తదితర చెరువులకు వర్షపునీరు చెప్పుకోదగ్గ స్థాయిలో చేరింది. బీరంగి, బడికాయలపల్లి చెరువులు పూర్తిగా నిండి మొరవ పోయాయి. భారీ వర్షం కారణంగా నగరపంచాయతీ పరిధిలోని దేగానిపల్లి- సూరపువాండ్లపల్లి మధ్యలో ఉన్న కల్వర్టు మీదుగా భారీగా వరదనీరు వెళ్లడంతో ఉదయం కొంతసేపు రాకపోకలు స్తంభించాయి. మండల వ్యాప్తంగా కుంటలు, చెరువులలో వర్షపునీరు చేరి కళకళలాడటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బస్టాండులో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలి

పీలేరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పీలేరు ఆర్టీసీ బస్టాండులో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బోదే షావలి కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన పీలేరు డీఎం రోషన్‌కు విజ్ఞప్తి చేశారు. బస్టాండులో మురుగునీటి పారుదల వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైనందున చిన్నపాటి వర్షానికి సైతం బస్టాండు చెరువును తలపిస్తోందన్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మురుగునీటి కాలువలతో పాటు బస్టాండు ప్రాంగణంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల వీధుల్లోని బోర్లు రీచార్జ్ అయ్యే అవకాశం ఉంటుందని సూచించారు.

సీపీఎస్ రద్దుకు కృషి చేయాలని వినతి

పీలేరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసేందుకు కృషి చేయాలని ఏపీసీపీఎస్‌ఈఏ నాయకులు విజ్ఞప్తి చేశారు. మదనపల్లె పర్యటనకు వచ్చిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను సోమవారం ఏపీసీపీఎస్ ఈఏ జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్, సుబ్రహ్మణ్యం, వసంత్‌కుమార్ కలిశారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే సీపీఎస్‌ను రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, ఆ హామిని నెరవేర్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. దీపావళి పండుగకైనా రెండు డీఏల ప్రకటన, పీఆర్‌సీ నియామకం, మధ్యంతర భృతి అంశాలను సైతం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

నిమ్మనపల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాలపై డ్రోన్ సహాయంతో ఉక్కుపాదం మోపుతున్నట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మండలానికి ఒక డ్రోన్ కెమెరా కేటాయించిందని, ఈ డ్రోన్ సహాయంతో ముష్టూరు పంచాయతీ దిగువపల్లిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని గుర్తించి వారి వద్ద నుండి రూ.21వేలను స్వాధీనం చేసుకుని ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా పేకాట, కోడిపందాలు, దొంగతనాలు వంటి అసాంఘిక కార్యకలాపాలు చేపడితే కఠిన చర్యలు తీసుకొంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

డివిజన్ స్కూల్ గేమ్స్ పోటీలు ప్రారంభం



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మదనపల్లె డివిజన్ స్కూల్ గేమ్స్ పోటీలను సోమవారం మదనపల్లె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల్లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు. డివిజన్‌లో 15 మండలాల నుంచి క్రీడాకారులు అండర్-14, -17 పోటీల్లో పాల్గొన్నారు. బాల బాలికలు వాలీబాల్, యోగ, బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగరాజ, డివిజన్ కో-ఆర్డినేటర్ భద్రయ్య తెలిపారు. అండర్-14 వాలీబాల్ బాలుర విజేతగా నిమ్మనపల్లె, బాలికలు విజేతగా రామసముద్రం, అండర్-17 బాలుర విజేతగా తంబళ్లపల్లె, రన్నర్స్‌గా పెద్దమండ్యెం నిలిచినట్లు తెలిపారు. అలాగే అండర్-17 బాడ్మింటన్ బాలికల విభాగంలో శరణ్య (ఢిల్లీ పబ్లిక్ స్కూల్), మోక్షత (వశిష్ట స్కూల్), ప్రిన్సీ (కలికిరి బాలికోన్నత పాఠశాల), బిందుప్రియ (కలికిరి గర్ల్స్ స్కూల్), సంధ్య (కోటపల్లె), అండర్-17బాలుర బ్యాడ్మింటన్‌లో కుశల్ (భాష్యం), కార్తీక్ (వశిష్ట ఐసీఐసీ), సూహెబ్ చెంబకూరు పవన్ చెంబకూరు, విక్రమాధిత్య సీటీఎం, అండర్-14బాలికల బాడ్మింటన్‌లో సుశీల (వశిష్ట ఐసీఐసీ), చైత్రదర్శని (మదనపల్లె భాష్యం), చందన (ఏపీఎస్‌డబ్ల్యూ ఆర్ కలకడ), కల్యాణి (సోంపల్లె జడ్పీ హెచ్‌ఎస్), షిఫాం అంజుం (సీటీఎం), అండర్- 14 బాలుర బ్యాడ్మింటన్‌లో మౌనిష్ (భాష్యం), నజీప్ (బి.కొత్తకోట అంబేద్కర్ గురుకుల పాఠశాల), నిఖిల్ తేజ (చిన్నకంపల్లె), ధనుష్ (వశిష్ట సీబీఎస్‌ఈ) విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో డివిజన్ కో- ఆర్డినేటర్లు శివశంకర్, భద్రయ్య, దిలీప్, వ్యాయామ ఉపాధ్యాయులు నరేష్, శారద, బాలాజీ, రెడ్డిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాగా ప్రకటించేంత వరకు ఉద్యమం

● బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్



సబ్‌కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీఎస్పీ నాయకులు

మదనపల్లె టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మదనపల్లె కేంద్రంగా కొత్త జిల్లాను ప్రకటించేంత వరకు ఉద్యమం చేస్తామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్ అన్నారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ ఎదుట బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో కొత్త జిల్లాల విభజన సమయంలో మదనపల్లె కేంద్రంగా జిల్లా చేస్తామని చెప్పి అప్పటి పాలకులు ప్రజలను మోసం చేశారన్నారు. అందుకే ఇక్కడి ప్రజలు ఎన్నికల్లో వైసీపీకి గట్టిగా బుద్ధి చెప్పారన్నారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాగా శాంతియుతంగా ధర్నా చేస్తున్న తమను సబ్‌కలెక్టర్, పోలీసులు అడ్డుకోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నేతలు సహదేవ, బాలాజీ, రమణ, చంద్ర, శివ, లక్ష్మీపతి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించాలి

నిమ్మనపల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను నిజమైన అర్హులకు అందించాలని ఎంపీడీవో రమేశ్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ నరసింహులు ఆధ్వర్యంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారిగా మండల స్థాయి అధికారులు చేపడుతున్న పనులపై ప్రజాప్రతినిధులకు వివరించారు. ముందుగా పశువైద్యాధికారి సురేశ్ మాట్లాడుతూ పాడిరైతుల కోసం పీఎం పశు కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా ఒక పాడి ఆవుకు గరిష్టంగా రూ.35వేలను అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే హర్టికల్చర్ హెచ్‌వో ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ డ్రిప్ ఇరిగేషన్ కింద 5ఎకరాల లోపు వున్న ఎస్సీ ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీపై అందిస్తున్నామని తెలిపారు. అలాగే మామిడి తోటల పెంపకానికి 10ఎకరాలకు రూ.12వేలు, సీతాఫలం తోటల పెంపకానికి రూ.8వేలను రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మిధున్ చక్రవర్తి మాట్లాడుతూ తాగునీటి సమస్య లేకుండా అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. అలాగే ఏవో మంజుల మాట్లాడుతూ రైతుల కోసం మూడు పంచాయతీల్లోని ఆర్బీకేలకు యూరియా వచ్చిందని మంగళవారం నుండి పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బాలరాజు, ఎంఈవో-1 పద్మావతి, ఎంఈవో-2 నారాయణ, ఏపీఎం మురళి, కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై సమాచారం అందించాలి : డీఎస్పీ

ములకలచెరువు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు, బాల్య వివాహాలపై తక్షణం సమాచారం అందించాలని మదనపల్లె డీఎస్పీ మహేంద్ర సూచించారు. స్థానిక కేజీఎన్ కళ్యాణమండపంలో సోమవారం ములకలచెరువు, బి.కొత్తకోట సర్కిళ్ల పరిధిలోని ఆరు మండలాల మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిస్సింగ్ కేసులు, గ్రామాల్లో బెల్ట్‌షాపులు, పేకాట, కోడి పందెలు జరిగితే ఎప్పటికప్పుడు సమాచారం తెలపాలన్నారు. రాబోవు స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. సీఐ వెంకటేశులు, ఎస్‌ఐలు నరసింహుడు, హరిహర్‌ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణ వ్రతం

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దతిప్పసముద్రంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆశ్వయుజ పౌర్ణమి సందర్భంగా ఆలయంలో విశేషపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం సత్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం సత్యనారాయణ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఇళ్ల స్థలాల కోసం సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు



సమస్యలు తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్ కళ్యాణి

మదనపల్లె టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పేదలైన తాము ప్రభుత్వం మంజూరు చేసే ఇంటి స్థలాల కోసం కాళ్లరిగేలా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నామని పలువురు సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణికి ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంకిశెట్టిపల్లె శ్మశానవాటిక కోసం కేటాయించిన 4 సెంట్ల భూమిని కొందరు రైతులు ఆక్రమించుకున్నారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. అంకిశెట్టిపల్లె పంచాయతీ నక్కలదిన్నె ప్రాంతంలో ఇళ్ల మధ్య సెల్‌టవర్ నిర్మాణం చేపడుతున్నారని, దీని వలన తమకు ఇబ్బందులు వస్తాయని నక్కలదిన్నె ప్రజలు సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వీటితో పాటు పాసుపుస్తకాల మ్యుటేషన్, భూముల సబ్ డివిజన్, రేషన్‌కార్డుల సమస్యలపై ఎక్కువ సంఖ్యలో అర్జీలు అందజేశారు. సకాలంలో సమస్యలు పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ ఆయాశాఖల అధికారులను ఆదేశించారు.

అక్రమ కట్టడాల తొలగింపు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని బీకేపల్లె ఇందిరమ్మ కాలనీ, వైఎస్సార్ నగర్, అమ్మచెరువు మిట్టలో రెవెన్యూ అధికారులు సోమవారం ఏకకాలంలో అక్రమాలను తొలగించారు. మదనపల్లె మున్సిపల్ ఏరియాలో అక్రమ కట్టడాలు, నిర్మాణాలు జరుగుతన్నట్లు సమాచారం అందడంతో రెవెన్యూ ఆర్ఐ బాలసుబ్రమణ్యం సిబ్బందితో వెళ్లి జేసీబీతో అక్రమకట్టడాలను నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎక్కడైనా అనుమతులు లేకుండా అక్రమకట్టడాలు చేపడితే చర్యలు తప్పని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్వోలు భరత్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా బ్రహ్మానందరెడ్డి

పీలేరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పీలేరు మండల డిప్యూటీ ఎంపీడీవోగా బ్రహ్మానందరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే పీలేరు గ్రామ పంచాయతీ కార్యదర్శిగానూ ఆయన అదనపు బాధ్యతలు చేపట్టారు. గుర్రంకొండ మండలంలో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం పీలేరుకు బదిలీ చేసింది. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనను పీలేరు ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, ధనాశి వెంకటరామయ్య ఘనంగా సన్మానించారు.

షటిల్ బ్యాడ్మింటన్‌లో కలికిరి బాలికల హవా



విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

కలికిరి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సోమవారం మదనపల్లెలో జరిగిన డివిజస్థాయి క్రీడా పోటీల్లో కలికిరి బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభ ప్రదర్శించారు. షటిల్ బాడ్మింటన్ క్రీడలో కలికిరికి చెందిన టి.ప్రిన్సీ, బిందుప్రియ హోరాహోరీ పోరాడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా కార్యదర్శి, పాఠశాల పీడీ చిన్నప్ప తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ



అన్నవితరణ చేస్తున్న కమిటీ సభ్యులు

పీలేరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): హజరత్ మహబూబ్ సుబహని గ్యార్మీ ఫాతెహాను సోమవారం పీలేరులోని జెండామాను వద్ద భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జెండామానులో హజరత్ మహబూబ్ సుబహని జీవిత చరిత్ర పారాయణం ముగింపు సందర్భంగా గ్యార్మీ ఫాతెహా కమిటీ సభ్యులు సోమవారం రాత్రి అన్నవితరణ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బుజ్జు, గాంధీ, నౌలాక్, ఫాజిల్, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

'పేదల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం'

పెద్దమండ్యం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) పేదల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల అధ్యక్షుడు జిట్టా వెంకటరమణ అన్నారు. సోమవారం పెద్దమండ్యంలో కూటమి నేతలతో పాటు ఆటోవాలాలతో ర్యాలీ నిర్వహించారు. ముందుగా నాలుగు రోడ్ల కూడలిలో టీడీపీ జండా ఆవిష్కరించి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందుతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాజంపేట పార్లమెంట్ ఎస్టీ అధ్యక్షుడు నటరాజ్‌నాయక్, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు నార శ్రీనివాసులు, జనసేన మండల అధ్యక్షుడు శంకర, కూటమి నేతలు మైసూరి శ్రీనివాసులు, బిక్కా మధుకర, వేణుగోపాల్‌రెడ్డి, సుబ్బరాంరెడ్డి, పెద్దన్న, బోడెం భాను, అష్రఫ్, నాగూరివలీ, జిట్టా రమేశ్, ప్రకాశ్‌రెడ్డి, డాక్టర్ రమేశ్, చౌడప్ప తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువులో టీడీపీ సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

ములకలచెరువు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో సోమవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం రూ.15వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేయడంతో టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా అధ్యర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండు సర్కిల్‌లో ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నకిష్టా, నేతలు ముత్తుకూరు మౌళా, జేసీబీ సుధాకర్‌నాయుడు, రామకృష్ణమరాజు, తోట గిరిధర్, నాగరాజుయాదవ్, హరిప్రసాద్‌యాదవ్, బయన్న, ఊరగాయల రామచంద్ర, ఉమాశంకర్, సోమశేఖర్, గంగాద్రి, నాగేంద్ర, రమణ, బసివిచంద్ర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల సేవలో టీడీపీ నాయకులు

బి.కొత్తకోట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన ఆటోడ్రైవర్ల సేవలో.. పథకం ఆటోడ్రైవర్లకు ఎంతగానో ఉపయోగకరంగా మారిందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం బి.కొత్తకోట జ్యోతిసర్కిల్‌లో పట్టణంలోని లబ్ధిదారులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దేవరింటి కుమార్, నాయకులు సమీవుల్లా, సుదర్శనరెడ్డి, సుకుమార్, సిద్దప్పనాయుడు, గట్టుఅంజి, కుడుం శరత్, రంజిత్, రాధాక్రిష్ణ, శిల్పాఅంజి, రెడెప్ప, షఫీ, జగదీష్, బండిరమణ తదితరులు పాల్గొన్నారు.

'పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటాం'

● టీడీపీ మండల నాయకులు



మండల కేంద్రమైన పీటీఎంలో పార్టీ జెండాలతో నినాదాలు చేస్తున్న టీడీపీ నాయకులు

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అదిష్ఠానం తీసుకునే ఎటువంటి నిర్ణయానికైనా కట్టుబడి ఉంటామని టీడీపీ నాయకులు అన్నారు. తెలుగుదేశం పార్టీ అంటేనే క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తున్నదని కొనియాడారు. సోమవారం మండల కేంద్రమైన పీటీఎం బస్టాండు కూడలిలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండాలతో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో ఏ స్థాయిలో ఉన్న వారైనా తప్పు చేస్తే పార్టీ ఉపేక్షించదన్నారు. నకిలీ మద్యం కేసులో పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న తంబళ్లపల్లె నియోజకవర్గం నాయకులను పార్టీ అధిష్ఠానం సస్పెండ్ చేసిందన్నారు. పార్టీకి నష్టం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుని తంబళ్లపల్లె నియోజకవర్గానికి మంచి నాయకుడిని ఇంచార్జ్‌గా అందించాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గూటం ఈశ్వరప్ప, మల్లెల సర్పంచ్ శ్రీకంఠరెడ్డి, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ (చిన్నా), మాజీ సర్పంచ్ ఇ.వి. రమణ, తాడిగోళ్లపల్లె సుధాకర్‌రెడ్డి, తమక శ్రీనివాసులు, మునిరెడ్డి, తిమ్మిరెడ్డిపల్లె శంకర, శివానంద, కార్యం సుబ్రమణ్యం, చింతకాయ వినోద్, రెడ్డిప్రసాద్ పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో టీడీపీ నేతల సంబరాలు

తంబళ్లపల్లె, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెలో సోమవారం టీడీపీ నాయకులు బాణసంచా పేల్చి పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. టీడీపీ క్రమశిక్షణ గల పార్టీ అని తప్పు చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించదని టీడీపీ నాయకులు అన్నారు. కల్తీ మద్యం తయారీ వ్యవహారంలో టీడీపీ ఇంచార్జి జయచంద్రారెడ్డిని అధిష్ఠానం సస్పెండ్ చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యమని, ఇంచార్జిగా ఎవరిని నియమించినా కష్టపడి పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, పురుషోత్తం, టీడీపీ పార్లమెంటు రైతు ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, తెలుగు యువత నరసింహులు, శివకుమార్‌నాయుడు, సోముశేఖర్, కాలా నారాయణ, రామ్మూర్తి నాయుడు, సుధాకర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎక్కడైనా బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హరిహరప్రసాద్ అన్నారు. ఇటీవల మొలకలచెరువులో నకిలీ మద్యం పట్టుబడడంతో అప్రమత్తమైన ఎస్‌ఐ సోమవారం మండలంలోని మద్దయ్యగారిపల్లె, కందుకూరు, కాట్నగల్లు, పట్టెంవాండ్లపల్లె, కమ్మచెరువు గ్రామాల్లో తనిఖీలు చేపట్టారు. ఆయా గ్రామాల్లో ఉన్న చిల్లర దుకాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. నకిలీ మద్యం తాగి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. గ్రామాల్లో ఎవరైనా మద్యం అమ్మినా, షాపులకు సరఫరా చేసినా అటువంటి వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు.

సీజేఐపై దాడిని ఖండించిన ప్రజాసంఘాలు

పీలేరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు సీజేఐ బీఆర్ గవాయిపై జరిగిన దాడిని పీలేరులోని ప్రజాసంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఆయనపై జరిగిన దాడిని కులవివక్షకు నిదర్శనమని, రాజ్యాంగం, పార్లమెంట్, సుప్రీంకోర్టుపై జరిగిన దాడిగా భావించాలని బాస్ నేత, డీవీఎంసీ సభ్యుడు పాలకుంట శ్రీనివాసులు, ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృతతేజ, మాలమహానాడు రాష్ట్రకార్యవర్గ సభ్యుడు తుమ్మల ధరణీకుమార్ పేర్కొన్నారు. సీజేఐపై దాడికి యత్నించిన న్యాయవాదిపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

'జస్టిస్ గవాయిపై దాడి న్యాయ వ్యవస్థపై దాడి'

మదనపల్లె అర్బన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు సీజేఐ జస్టిస్ గవాయిపై దాడి న్యాయవ్యవస్థపై దాడితో సమానమని మాలమహానాడు జాతీయ నేత యమల సుదర్శనం సోమవారం పేర్కొన్నారు. ఒక కేసు విచారణ సమయంలో సనాతనధర్మానికి భంగం కలిగించారని, ఇవి వారిపై అనుచిత వాఖ్యలుగా భావించి కోర్టులోనే సీజేఐ గవాయ్‌పై బూటు విసరడానికి ప్రయత్నించారని, ఇది సభ్యసమాజం తలదించుకునే చర్య అని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఆ మనువాదిపై ఎస్సీఎస్టీ హత్యాచార నిరోధక చట్టం కింద అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు ధర్మపథంలో పౌర్ణమి వేడుకలు

వాల్మీకిపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణ పొడమర పొలిమేరలోని ధర్మపథం సమూహాలయంలో మంగళవారం షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకుడు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు తెలిపారు. మంగళవారం ఉదయం సత్యనారాయణ వ్రతం, సాయంత్రం సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణ మహోత్సవం అనంతరం రాత్రికి పౌర్ణమి వెలుగులో కార్యసిద్ధి అభయాంజనేయస్వామికి సింధూర పూజ, వడమాల సమర్పణ; ఆకుపూజ, ఉంటుందని, అనంతరం భక్తులకు అన్నసమర్పణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామికృపకు పాత్రులు కావాలని ఈసందర్భంగా ఆయన కోరారు.

నేడు పెద్దమండ్యం మండల్ సమావేశం

పెద్దమండ్యం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 7వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీధర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఎంపీపీ పూర్ణచంద్రిక అధ్యక్షతన జరుగునున్న ఈ సమావేశానికి మండల శాఖాధికారులు, సిబ్బంది హాజరుకావాలని సూచించారు.



పీకేఎం ఉడా చైర్మన్‌గా ప్రమాణస్వీకారం సందర్భంగా సురేశ్‌బాబును గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నాయకులు